జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




రంగారెడ్డి | సోమవారం 27 జనవరి 2025 | సంపుటి : 17 | సంచిక : 300 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516


విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from: GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## స్వర్ణాంధ్ర విజన్ దిశగా

# అడుగులు

- విజయవాడ మున్సిపల్ గ్రౌండ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు
- జాతీయ పతాకం ఆవిష్కరించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- గత ప్రభుత్వ పాలనతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ధ్వంసమైంది
- నిలిచిపోయిన ప్రాజెక్టులు, విచ్ఛిన్నమైన పాలనా వ్యవస్థతో ఏపీ సర్కార్‌పై భారం పడింది
- సార్వత్రిక , ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు చారిత్రాత్మకమైన తీర్పును అందించారు



"సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం దూరదృష్టి గల నాయకత్వం మార్గదర్శకత్వంలో నడుస్తోంది. గత పాలనలో దుష్పరిపాలన వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ప్రజలకు తెలియజేయడం మన నైతిక కర్తవ్యం. మా సర్కార్ ఏడు శ్వేతపత్రాలు విడుదల చేసి వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేసింది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో తెలియజేశాం. ఎన్డీయే ప్రభుత్వం ఆర్థిక అవరోధాలను అధిగమించి రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తోంది."

- జస్టిస్ అబ్దుల్ నజీర్, గవర్నర్

3





## బీజేపీకి రాజ్యాంగం అంటే గౌరవం లేదు

- జగన్ బీజేపీకి గులాం గిరీ చేశారు
- వైఎస్ఆర్ ఆశయాలను తుంగలో తొక్కారు
- మనకున్న ఈ హక్కులు అన్ని మన రాజ్యాంగం కల్పించినవే
- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి

# AIతో సీఎం

- కెమెరామెన్ లేకుండానే చంద్రబాబు సమావేశం ప్రత్యక్షప్రసారం
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో సీఎం చంద్రబాబు వినూత్న ప్రయోగం
- కెమెరామెన్ లేకుండానే ప్రెస్‌మీట్ నిర్వహణ
- సీఎం చంద్రబాబు నివాసంలో 4 కెమెరాలతో మల్టీవీడియో కెమెరా సిస్టమ్ ఏర్పాటు
- దీనిద్వారానే అక్కడ నుంచి లైవ్ కవరేజీ



అత్యాధునిక టెక్నాలజీ వినియోగంలో చంద్రబాబు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నిత్యం కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఉంటారు. మోడర్న్ టెక్నాలజీని వినియోగించడంలో ముందుండే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో వినూత్నం ప్రయోగం చేశారు. దావోస్ పర్యటన అనంతరం సీఎం చంద్రబాబు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అయితే మామూలుగా ప్రెస్‌మీట్ అంటే విలేకరులు, కెమెరామెన్‌లతో గందరగోళంగా ఉంటుంది. అందుకే సీఎం చంద్రబాబు వినూత్న ఆలోచనకు తెరతీశారు. వినూత్నంగా కేవలం విలేకరులతో మాత్రమే ప్రెస్‌మీట్ నిర్వహించారు. మరి కెమెరామెన్‌లు ఎక్కడ అనేదేగా మీ ప్రశ్న. అయితే అవేం అవసరం లేకుండా ఏఐతోనే ఈ సమావేశం పూర్తి చేశారు. ఏఐతో పనిచేసే సిస్టమ్ : వీడియోగ్రాఫర్లు, కెమెరామెన్‌లు లేకుండా పూర్తిగా ఏఐతో పనిచేసే సిస్టమ్?ను వినియోగించారు. ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో 4 కెమెరాలతో మల్టీవీడియో కెమెరా సిస్టమ్? ఏర్పాటు చేశారు. దీనిద్వారానే అక్కడ నుంచి లైవ్ కవరేజీ అందించారు. సమావేశం జరిగే హాల్‌లోకి చంద్రబాబు వచ్చిన సమయంలో ఒక కెమెరాకు సూచనలు - మిగతా3లో

## ఘనంగా గణతంత్ర వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి
- బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, పినాక మల్టీబ్యారెల్ రాకెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
- సైనిక అమరవీరులకు మోదీ నివాళి





## 100వ ప్రయోగానికి ఇస్రో సిద్ధం!

- ప్రయోగ వేదికపైకి జీఎస్ఎల్‌వీ 15ఎఫ్ రాకెట్!
- జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్‌ను నింగిలోకి పంపనున్నది
- ఈ రాకెట్ ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని భారత్ స్పేస్‌లోకి పంపనున్నది
- ప్రయోగం సందర్భంగా కౌంట్‌డౌన్‌లో మూడురోజుల కంటే తక్కువ సమయం మాత్రమే మిగిలి ఉందని ఇస్రో పేర్కొంది.

## ప్రముఖుల రాకతో సందడిగా 'ఎట్ హోమ్'

- విజయవాడ రాజ్‌భవన్‌లో 'ఎట్ హోమ్' కార్యక్రమం
- కార్యక్రమానికి హాజరైన చంద్రబాబు, పవన్ కల్యాణ్

విజయవాడ

గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో 'ఎట్ హెూం' కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఇచ్చిన ఆతిథ్య విందు ఎట్ హెూం కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు హాజరయ్యారు. సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి సహా పలువురు హాజరు - మిగతా3లో



# ఘనంగా గణతంత్ర వేడుకలు

గణతంత్ర వేడుకల సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. సైనిక బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. త్రివిధ దళాలు సంయుక్తంగా ఒక శకటాన్ని తీసుకురావడం ఈసారి ప్రత్యేకత. వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కేంద్ర మంత్రులు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది స్వర్ణిమ్ భారత్, విరాసత్ ఔర్ వికాస్ ఇతివృత్తంతో ఈసారి కవాతులో పాల్గొనే శకటాలకు రూపకల్పన చేశారు. బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, పినాక మల్టీబ్యారెల్ రాకెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కర్తవ్య పథ్‌పై హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. రాష్ట్రపతి భవన్ నుంచి ఎర్రకోట వరకు 9 కిలోమీటర్ల మేర రిపబ్లిక్ డే పరేడ్ ఏర్పాటు చేశారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర శాఖలకు చెందిన 31 శకటాలను ప్రదర్శించారు.



**సైనిక అమరవీరులకు మోదీ నివాళి**

76వ రిపబ్లిక్ వేడుకలను పురస్కరించుకొని ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ సైనిక అమరవీరులకు నివాళి అర్పించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, త్రివిధదళాల అధిపతులతో కలిసి ఇండియా గేట్ సమీపంలోని జాతీయ యుద్ధస్మారకం వద్దకు చేరుకున్న ప్రధాని మోదీకి రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్వాగతం పలికారు. అమరవీరుల స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించిన ప్రధాని మోదీ ఆ తర్వాత సైనికవందనం స్వీకరించారు. అమరులకు రెండునిమిషాలు మౌనం పాటించారు. సందర్శకుల పుస్తకంలో సంతకం చేసిన అనంతరం ప్రధాని మోదీ కర్తవ్యపథ్‌కు చేరుకున్నారు.

**మహానుభావులకు శిరస్సు వంచి ప్రణామం**

అంతకుముందు దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు మోదీ. మన ప్రయాణం ప్రజాస్వామ్య పద్ధతిలో, గౌరవంగా, ఐక్యంగా సాగేలా రాజ్యాంగాన్ని రచించిన మహానుభావులకు శిరస్సు వంచి ప్రణామం చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ ఆశయాల పరిరక్షణకు, బలమైన, సుసంపన్న భారతావనిని నిర్మించే దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ఈ వేడుక బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# 100వ ప్రయోగానికి ఇస్రో సిద్ధం!

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో మైలు రాయికి చేరుకునేందుకు సిద్ధమైంది. జనవరి 29న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి వందో ప్రయోగం చేపట్టనున్నది. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్‌ను నింగిలోకి పంపనున్నది. ఈ రాకెట్ ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని భారత్ స్పేస్‌లోకి పంపనున్నది. అయితే, జీఎస్ఎల్వీ-15 రాకెట్‌తో ఎన్‌వీఎస్ ఉపగ్రహం అనుసంధాన ప్రక్రియ పూర్తయ్యిందని ఇస్రో ఆదివారం పేర్కొంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొంది. ప్రయోగం సందర్భంగా కౌంట్‌డౌన్‌లో మూడురోజుల కంటే తక్కువ సమయం మాత్రమే మిగిలి ఉందని ఇస్రో పేర్కొంది. జీఎస్ఎల్‌వీ-ఎఫ్ 15 రాకెట్ ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని భూస్థిర లక్ష్యలో ప్రేవశపెడుతుందని పేర్కొంది. షార్‌లోని రెండో లాంచ్‌ప్యాడ్ నుంచి ప్రయోగం చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ ఉపగ్రహం సెకండ్ జెనరేషన్ శాటిలైట్ కాగా.. ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని 29 మే 2023న ఇస్రో నింగిలోకి పంపింది. ఇది ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం ఎన్‌వీఎస్ సిరీస్‌లో రెండో ఉపగ్రహం. ఎల్1, ఎల్5, ఎస్ బ్యాండ్‌లలో నావిగేషన్ పేలోడ్లను.. అలాగే తొలితరం ఉపగ్రహం ఎన్‌వీఎస్-01లో ఉన్నట్లుగానే సీబ్యాండ్‌లో రేజింగ్ పేలోడ్స్ ఉంటాయి. నావిక్ అనేది భారతదేశ స్వతంత్ర ప్రాంతీయ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ.

భారత భూభాగం నుంచి దాదాపు 1500 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో వినియోగదారులకు ఖచ్చితమైన స్థానం, వేగం, సమయం సేవలను అందించడం దీని ఉద్దేశం. కొత్త శాటిలైట్‌తో దేశీయ నావిగేషన్ వ్యవస్థ నావిక్ మరింత విస్తృతం కానున్నది. ఈ ఉపగ్రహాన్ని బెంగళూరులోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్‌లో రూపొందించగా.. ఇతర శాటిలైట్ సెంటర్లు సహకారం అందించాయి. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ జీఎస్ఎల్వీ సిరీస్‌లో 17వది కావడం విశేషం. దేశీయ క్రయోజెనిక్ స్టేజ్ కలిగిన 11వ రాకెట్. ఈ ప్రయోగం ద్వారా ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ఇస్రో ప్రవేశపెడుతుంది.



# రిపబ్లిక్‌డే పరేడ్‌లో 'ఉమెన్' పవర్

**చరిత్రలో తొలిసారి 100మంది అలా- 148మంది ఇలా!**

**గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన కవాతులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నారీశక్తి**

**15మంది మహిళా పైలట్ల బృందం ఫ్లై-పాస్ట్**

**అధునాతన రక్షణ సాంకేతికతల ద్వారా దేశ భద్రతను బలోపేతం చేయడంలో అతివలు అందించిన కీలకమైన సహకారాన్ని అందులో ప్రదర్శించారు**

ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో గణతంత్ర దినోత్సవ కవాతు ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో వికసిత్ భారత్, నారీ శక్తి అంశాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దేశ చరిత్రలో తొలిసారిగా 100మంది మహిళలు శంఖం, నాదస్వరం వంటి సంప్రదాయ సంగీత వాయిద్యాలను వాయిస్తూ కర్తవ్యపథ్‌లో పరేడ్‌ను ప్రారంభించారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లో నారీ శక్తికి ప్రాతినిధ్యం వహిస్తూ మహిళా అధికారులు లెఫ్టినెంట్ కర్నల్ రవీందర్‌జీత్ రంధావా, లెఫ్టినెంట్ కమాండర్ మణి అగర్వాల్, ఫ్లైట్ లెఫ్టినెంట్ రుచి సాహ్, కెప్టెన్ సంధ్యా మహ్లా దీనిలో పాల్గొన్నారు.

15మంది మహిళా పైలట్ల బృందం ఫ్లై-పాస్ట్

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్-%ణ=ఋ% నిర్వహించిన కవాతుకు మహిళా శాస్త్రవేత్త సునీతా జెనా నాయకత్వం వహించారు. అధునాతన రక్షణ సాంకేతికతల ద్వారా దేశ భద్రతను బలోపేతం చేయడంలో అతివలు అందించిన కీలకమైన సహకారాన్ని అందులో ప్రదర్శించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఐశ్వర్య జాయ్ నేతృత్వంలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన 148 మంది సభ్యుల మహిళా బృందం, డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆదిత్య నేతృత్వంలోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ బృందం పరేడ్‌లో పాల్గొన్నాయి. సుమారు 15మంది మహిళా పైలట్ల బృందం ఫ్లై-పాస్ట్‌లో తమ ప్రతిభను చూపారు.



కవాతులో 16 రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన శకటాలు సందడి చేశాయి. వీటిలో మహిళా సాధికారత అంశాన్ని ప్రతిబింబించేవి 26 ఉన్నాయి. మణిపుర్‌లో తామర పూల కాడలలోని సున్నితమైన నారలతో చీరలు తయారు చేసే మహిళలు, పడవలు నడుపుతున్న స్త్రీలు, హస్తకళలు, చేనేత సహా వివిధ రంగాల్లో ప్రఖ్యాతి పొందిన వారికి సంబంధించిన విషయాలను ప్రదర్శించారు.

ఇండోనేసియాకు చెందిన నేషనల్ ఆర్మ్‌డు ఫోర్సెస్ నుంచి 152 మంది బృందం కవాతులో పాల్గొంది. మరో 190 మంది సభ్యుల బ్యాండ్ బృందం మార్చ్ నిర్వహించింది. లెఫ్టినెంట్ అహాన్ కుమార్ నేతృత్వంలోని 61 మంది అశ్విక దళం కవాతు నిర్వహించింది. అనంతరం ట్యాంక్ %ు%-90 (భీష్మ), %దీవీ%-2 శరత్‌తో పాటు నాగ్, బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థలు, పినాక, అగ్నిబాణ్ మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లు, ఆకాశ్ వెపన్ సిస్టమ్, చేతక్, బజరంగ్, ఐరావత్‌తో సహా పలు ఆయుధాలను ప్రదర్శించారు. ఈ వేడుకల్లో త్రివిధ దళాలు సంయుక్తంగా ప్రదర్శించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'సశక్త్ ఔర్ సురక్షిత్ భారత్' అనే థీమ్‌తో దీన్ని తయారు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఐదు వేల మంది కళాకారులు 'జయతి జయ మహాభారతం' పాటకు 11 నిమిషాల పాటు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. మోటారు సైకిళ్లపై డేర్‌డెవిల్స్ చేసిన విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయి. బుల్లెట్ సెల్యూట్, ట్యాంక్ టాప్, డబుల్ జిమ్మీ, డెవిల్స్ డౌన్ వంటి అంశాలను ప్రదర్శించారు. 22 ఫైటర్ జెట్‌లు , 11 ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, ఏడు హెలికాప్టర్‌లు వైమానిక ప్రదర్శన వీక్షకులను కట్టిపడేసింది. వీటిలో రఫేల్, సు-30, జాగ్వార్, సి-130,సి-295, సి-17, డోర్నియర్-228, ఏఎన్-31 విమానాలతో పాటు ఎమ్ఐ-17 హెలికాప్టర్లు ఉన్నాయి.

## 500 మంది ధనవంతులకు.. పది లక్షల కోట్ల రుణాలను బీజేపీ మాఫీ చేసింది: అరవింద్ కేజ్రీవాల్




న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బీజేపీపై మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ ఐదేళ్లలో సుమారు 400 నుంచి 500 మంది ధనవంతులైన స్నేహితులకు పది లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఏ మోడల్‌ను ఎంచుకుంటారో అన్నది ఢిల్లీ ప్రజలు నిర్ణయించుకోవాలని కోరారు. 'ఢిల్లీ ప్రజలకు రెండు నమూనాలు ఉన్నాయి. మొదటిది కేజ్రీవాల్ మోడల్. ఇక్కడ ప్రజల డబ్బును ప్రజల కోసం ఖర్చు చేస్తారు. రెండవది బీజేపీ మోడల్. ఇక్కడ ప్రజల డబ్బు ధనవంతులైన వారి స్నేహితుల జేబుల్లోకి వెళుంది. ఇప్పుడు ప్రజలు ఏ నమూనాను ఎంచుకోవాలో నిర్ణయించుకోవాలి' అని అన్నారు. కాగా, ఆప్ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఢిల్లీ ప్రజలు నెలకు రూ.25,000 వరకు ప్రయోజనాలను పొందుతున్నారని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. అయితే బీజేపీ అధికారంలోకి వస్తే వారి నమూనాకు విరుద్ధం కాబట్టి అన్ని సంక్షేమ పథకాలను నిలిపివేస్తారని అన్నారు. మరోవైపు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

## దేశ స్వాతంత్ర్యం కోసం బీజేపీ చేసిందేమీ లేదు

**బీజేపీ అన్ని రాజ్యాంగ విలువలను తుంగలోకి తొక్కింది**

**ఇండియాకు స్వాంతంత్ర్యం తెచ్చిందీ, దేశ ఐక్యత కోసం పోరాటం సాగించిందీ కాంగ్రెస్ పార్టీయే**

**కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే**



**బెంగళూరు:** దేశ స్వాతంత్ర్యం కోసం కానీ, ఆర్థిక, సామాజిక వృద్ధి కోసం కానీ బీజేపీ చేసిందేమీ లేదని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బీజేపీ అన్ని రాజ్యాంగ విలువలను తుంగలోకి తొక్కిందని విమర్శించారు. రిపబ్లిక్ డే సందర్భంగా కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కార్యాలయంలో త్రివర్ణ పతాకావిష్కరణ అనంతరం కాంగ్రెస్ కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి ఖర్గే మాట్లాడుతూ, ఇండియాకు స్వాంతంత్ర్యం తెచ్చిందీ, దేశ ఐక్యత కోసం పోరాటం సాగించిందీ కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. "ఇటీవల పలువురు నేతలు ముఖ్యంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజ్యాంగాన్ని అవమానించిన తీరు బాధాకరం. భారత రాజ్యాంగ నిర్మాతపై దిగజారుడు వ్యాఖ్యలు చేశారు. అప్పుడు నేను పార్లమెంటులోనే ఉన్నాను. మీరు అంబేద్కర్ నామజపం చేస్తున్నారు..భగవంతుడి జపం చేస్తే స్వర్గంలో చోటైనా దక్కుతుందని అమిత్‌షా మాట్లాడారు. వీళ్లు దేశ స్వాంతత్రానికి గానీ, ఆర్థిక, సామాజిక వృద్ధి కోసం చేసిందేమీ లేదు" అని ఖర్గే అన్నారు. రిపబ్లిక్ డే ప్రాధాన్యతను ఖర్గే వివరిస్తూ, రాజ్యంగానికి దేశప్రజలంతా కట్టుబడి ఉంటాలని, కానీ కొన్ని కారణాల వల్ల రాజ్యాంగ విలువలన్నింటినీ బీజేపీ సారథ్యంలోని కేంద్రం తుంగలోకి తొక్కిందని అన్నారు. పౌరుల హక్కులు, ముఖ్యంగా మహిళలకు రాజ్యాంగ ప్రసాదించిన స్వేచ్ఛను దిగజార్చారని విమర్శించారు. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను మారుస్తామని ప్రధాని మోదీ చెబుతున్నప్పటికీ 5వ స్థానం నుంచి కదలడం లేదని అన్నారు. యూపీఏ హయాంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న దేశాన్ని ఐదో స్థానానికి నెట్టేశారని విమర్శించారు. బడా వ్యాపారులు, శక్తివంతులకు గరిష్ట ప్రయోజనాలు చేకూరుస్తూ పేదలను పట్టించుకోవడం లేదని అన్నారు. "జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్" నినాదాన్ని కార్యకర్తలందరూ అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు

## సైఫ్ అలీ ఖాన్ కేసులో బిగ్ ట్విస్ట్

**నిందితుడి వేలిముద్రలు మిస్ మ్యాచ్ ఇంతకీ అసలు నేరస్థుడు ఏమైనట్లు**

**సైఫ్ అలీ ఖాన్ కేసులో కీలక మలుపు**

**నిందితుని వేలిముద్రలు మిస్ మ్యాచ్!**



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో ఊహించని ట్విస్ట్ బయటపడినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న బాంద్రా పోలీసులు సైఫ్‌పై దాడికి పాలపడిన నిందితుడు షరీఫుల్ ఇస్లాం వేలిముద్రలను సేకరించారు. అయితే దాడి జరిగిన ప్రదేశంలో లభించిన ఫింగర్ ప్రింట్స్ - నిందితుడితో సరిపోలడం లేదని పోలీసులు గుర్తించినట్లు కథనాలు వెలువడుతున్నాయి. ముంబయిలో ఈనెల 16వ తేదీ తెల్లవారుజామున బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ నివాసంలోకి చొరబడిన దుండగుడు, ఆయనపై దాడిచేసిన కేసు అనేక మలుపులు తిరుగుతోంది. విచారణలో భాగంగా నటుడి ఇంటిని పరిశీలించిన మహారాష్ట్ర సీఐడీ విభాగంలోని క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ బృందం అక్కడ ఉన్న దాదాపు 19 వేలిముద్రలను సేకరించింది. వాటిల్లో ఏవీ నిందితుడి ఫింగర్ ప్రింట్స్‌తో మ్యాచ్ కావడం లేదని పోలీసులకు ఫోరెన్సిక్ బృందం వెల్లడించినట్లు తెలుస్తోంది. తదుపరి పరీక్షల కోసం మరోసారి ఘటనా స్థలం నుంచి మరిన్ని వేలిముద్రల నమూనాల్ని సేకరించాలని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు కేసు విచారణ కోసం ముంబయి పోలీసులు సైఫ్ రక్త నమూనాలను, దాడి జరిగిన రోజు ఆయన ధరించిన దుస్తులను సేకరించారు. వీటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఈ కేసులో నిందితుడైన షరీఫుల్ ఇస్లాం దొంగతనం చేయాలనే ఉద్దేశంతోనే ఆ ఇంట్లోకి ప్రవేశించాడని, అయితే తరువాత పరిస్థితి తీవ్ర ఘర్షణకు దారితీసిందని ప్రాథమిక విచారణలో తేలింది. అందుకే దాడి సమయంలో సైఫ్ ధరించిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి దుస్తులపై రక్తపు మరకలు కనిపించడం వల్ల అవి సైఫ్ అలీఖాన్‌వేనా, కాదా అని నిర్ధరించడం కోసం నమూనాలు సేకరించారు. దుండగుడి దుస్తులను, సైఫ్ రక్తనమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు అధికారులు తెలిపారు. నిందితుడి దాడిలో సైఫ్ అలీఖాన్ వెన్నెముక, చెయ్యి సహా పలుచోట్ల గాయాలయ్యాయి. ఐదు రోజులపాటు ముంబయిలోని లీలావతి ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయనకు కత్తి గాట్లు పడిన చోట శస్త్రచికిత్స కూడా చేశారు. ఒకటి రెండుచోట్ల ప్లాస్టిక్ సర్జరీ సైతం నిర్వహించారు. ఈనెల 21న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సైఫ్ అలీఖాన్ ప్రస్తుతం కోలుకుంటున్నారు.

## త్వరగా రా.. మూడ్‌లో ఉన్నా

**మహిళకు ఉబర్ డ్రైవర్ మెసేజ్.. తర్వాత ఏం జరిగిందంటే..**

ఆమె ఢిల్లీలోని ఐపీఆర్ లాయర్.. పేరు తాన్యా శర్మ.. ఆమె ఉబర్ ద్వారా ఆటోను బుక్ చేసింది.. అయితే అప్పటికే ఆమెకు ఆటో డ్రైవర్ నుంచి అసభ్యకర మెసేజ్ వచ్చింది.. దీంతో ఆమె ఆ డ్రైవర్ గురించి ఉబర్ సంస్థకు ఫిర్యాదు చేసింది.. అయితే ఆ సంస్థ సరైన రీతిలో స్పందించలేదు.. చివరకు తాన్యా శర్మ పోరాటం కారణంగా ఉబర్ దిగి వచ్చింది.. ఆ ఆటో డ్రైవర్‌ను తొలగించింది.. ఆ ఘటన గురించి తాన్యా శర్మ లింక్డిన్‌లో పోస్ట్ చేసింది. ఆ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ ఘటనపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు తాన్యా శర్మ అనే మహిళా లాయర్ ఉబర్ యాప్‌లో ఆటో బుక్ చేసుకుంది. వెంటనే డ్రైవర్ నుంచి ఆమెకు మెసేజ్ వచ్చింది. -జల్దీ ఆవో బాబు యర్. మన్ హెూ రహా హై- (త్వరగా రా. నేను మూడ్‌లో ఉన్నా) అంటూ డ్రైవర్ ఆమెకు అసభ్యంగా మెసేజ్ పెట్టాడు. దీంతో ఒక్కసారిగా షాక్ తిన్న తాన్య వెంటనే ఆ రైడ్‌ను క్యాన్సిల్ చేసుకుంది. ఉబర్ యాప్‌లో కంప్లైంట్ కూడా పెట్టింది. దానికి స్పందనగా ఘటనపై 48 గంటల్లో విచారణ జరిపిస్తామని మెసేజ్ పంపింది. ఉబర్ ఇండియా స్పందించిన తీరుపై తాన్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఒకవేళ ఈ 48 గంటల్లో ఇంకొంతమంది మహిళలకు ఇలాంటి అనుభవం ఎదురైతే ఎవరు బాధ్యత వహిస్తారు?%--% అంటూ ఉబర్‌ను సూటిగా ప్రశ్నించింది. తాన్య పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉబర్ సంస్థ దిగొచ్చింది. వెంటనే స్పందించి ఆ డ్రైవర్‌ను శాశ్వతంగా బ్లాక్ చేసింది. నెటిజన్లు, శ్రేయోభిలాషుల మద్దతుతోనే ఇది సాధ్యమైందని తాన్యా శర్మ కృతజ్ఞతలు తెలిపింది. ఇలాంటి ఘటనలను తేలిగ్గా తీసుకోవద్దని, వెంటనే రిపోర్ట్ చేయాలని, అందరూ అప్రమత్తంగా ఉండాలని తాన్య సూచించింది.

# స్వర్ణాంధ్ర విజన్ దిశగా అడుగులు



గణతంత్ర దినోత్సవ వేడుకలను రాష్ట్రప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ గ్రౌండ్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శనను ఆయన వీక్షించారు. పరిశ్రమలు, పర్యాటక, సెర్ప్, గృహనిర్మాణ శాఖ , పాఠశాల విద్య, నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ శకటాలు ఆకట్టుకున్నాయి.

అదేవిధంగా ఆరోగ్యశాఖ, మహిళాశిశు సంక్షేమం, జలవనరుల శాఖ, అటవీ, వ్యవసాయ, మత్స్య శాఖ , ఏపీసీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, ఇంధనశాఖ ఉద్యాన, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, ఆర్‌టీజీఎస్ శకటాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఏడు నెలల క్రితం ఏపీ తీవ్రమైన ఆర్థిక సమస్యల్లో ఉందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ పాలనతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ధ్వంసమైందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వివరించారు. వైఎస్సార్సీపీ హయాంలో చేసిన అప్పులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతినట్లు చెప్పారు. నిలిచిపోయిన ప్రాజెక్టులు, విచ్ఛిన్నమైన పాలనా వ్యవస్థతో ఏపీ సర్కార్?పై భారం పడిందని తెలిపారు. ఈ గందరగోళం మధ్య, ఇటీవల జరిగిన సార్వత్రిక , ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు చారిత్రాత్మకమైన తీర్పును అందించారని గవర్నర్ వెల్లడించారు.

'రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలను అందిస్తోంది. నిధులు విడుదల చేయడం వల్ల అమరావతి రాజధాని నగరంలోని నిలిచిపోయిన పనులను పునరుద్ధరించింది. పతనావస్థలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ ద్వారా పునరుద్ధరించింది. పోలవరం ప్రాజెక్టును కేంద్రం మళ్లీ ట్రాక్‌లోకి తీసుకువచ్చింది. కేంద్రం సహకారంతో రాష్ట్ర ఆర్థిక స్థితిని స్థిరీకరించే దిశగా సర్కార్ కృషి చేస్తోంది' అని గవర్నర్ తెలిపారు.

ఏపీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర విజన్ 2047 రోడ్‌మ్యాప్‌ను రూపొందించిందని గవర్నర్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్ష వికసిత్ భారత్ నెరవేర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనంద కరమైన ఆంధ్రప్రదేశ్‌ని రూపొందించడమే లక్ష్యమని తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్? 2047 కోసం పది మార్గదర్శక సూత్రాలు రూపొందించామని వివరించారు.

"స్వర్ణాంధ్ర 2047 మన గణతంత్ర స్ఫూర్తి, మన కలలను ప్రతిబింబిస్తుంది. స్వర్ణాంధ్ర 2047 కోసం రూపొందించిన పది సూత్రాలు మన రాష్ట్ర పరివర్తనలో కీలకమైన పరిణామం. పేదరికం లేని ఆంధ్ర ప్రదేశ్‌ను రూపొందించడమే లక్ష్యం. రాష్ట్రాన్ని ప్రపంచానికి అనుసంధానించడానికి అపార తీరప్రాంతం ఉంది. అంతర్జాతీయ వాణిజ్యానికి ఇది రాష్ట్రాన్ని గేట్‌వేగా మారుస్తుంది. రాష్ట్రంలో పేదరికం సున్నా చేయడమే ప్రభుత్వ లక్ష్యం."

'ప్రభుత్వం వచ్చాక నెలవారీ పెన్షన్‌ను 3000ల నుంచి 4000లకి పెంచాం. అందరికీ ఇళ్లు, దీపం 2.0 సహా ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి వంటి అనేక కార్యక్రమాలను చేపట్టాం. పేదరిక నిర్మూలన కార్యక్రమాలను పూర్తి చేస్తూ, మా సర్కార్ 'జీరో పావర్టీ-పీ4 పాలసీని మరింత ముందుకు తీసుకువస్తోంది. ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, ఓబీసీలు, మహిళలు సంక్షేమం, అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది.' అని జస్టిస్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు.

సమ్మిళిత వృద్ధి, సహా బలమైన సామాజిక-ఆర్థిక అభివృద్ధిని పెంపొందింపజేస్తామని గవర్నర్ తెలిపారు. సమీప భవిష్యత్?లో ఆంధ్రప్రదేశ్‌ను పేదరికం లేని రాష్ట్రంగా మార్చాలని తాము భావిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పెట్టుబడులు రాబట్టేందుకు నూతన పారిశ్రామిక అభివృద్ధి విధానం (4.0) రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు.

మరోవైపు ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు గణతంత్ర వేడుకలను నిర్వహించారు. గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచారు. దేశ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహనీయుల త్యాగాలను మరోసారి స్మరించుకుందామని వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ సాధనకు రాజ్యాంగ స్ఫూర్తితో కృషి చేద్దామని సీఎం పిలుపునిచ్చారు.

# పండుగలన్నీ ఆదివారాలే...

**హైదరాబాద్ :** సెలవులు అంటే ఉద్యోగులకే కాదు, విద్యార్థులకు కూడా ఎంతో ఇష్టం! కానీ ఏటా లిమిటెడ్‌గా వచ్చే సెలవులే వీకెండ్‌లకు పడితే మాత్రం అసలు అసంతృప్తి తథ్యం. ఇప్పుడు అదే పరిస్థితి రిపబ్లిక్ డే (జనవరి 26) విషయంలో ఎదురైంది. ఈ ఏడాది రిపబ్లిక్ డే ఆదివారం రోజుకు వచ్చింది. సాధారణంగా ఇది నేషనల్ హాలీడే అయినప్పటికీ, వీకెండ్‌కి పడిపోయిన కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు ప్రత్యేక సెలవును ఆస్వాదించలేకపోతున్నారు. "సంక్రాంతి తర్వాత వచ్చే ఈ బ్రేక్ చాలా అవసరమైంది.. కానీ వారం చివరికి వచ్చేయడంతో, సెలవు అని అసలు ఫీలింగే లేదు!" అని ఐటీ ఉద్యోగులు సోషల్ మీడియాలో తమ నిరాశను వ్యక్తం చేస్తున్నారు.ఐటీ రంగంలో పని చేసే వారు వీకెండ్ హాలీడేస్‌ను స్మార్ట్‌గా ప్లాన్ చేసుకుని చిన్న ట్రిప్స్ ప్లాన్ చేసుకోవడం సాధారణం. అయితే, జనవరి 26 ఆదివారం రావడం వల్ల ఈసారి అదీ అసాధ్యమైంది."ఒకరోజు ముందు లేదా తరువాత వచ్చుంటే నాలుగో శనివారం + ఆదివారం + రిపబ్లిక్ డే కలిపి లాంగ్ వీకెండ్ వచ్చేది" అంటూ నిరాశ వ్యక్తం చేస్తున్నారు.ఈ ఏడాది ఇదే సమస్య మార్చిలో కూడా ఎదురుకానుంది. ఉగాది (తెలుగు నూతన సంవత్సర దినోత్సవం) కూడా మార్చి 31, ఆదివారానికి వస్తోంది. అంటే ఉద్యోగులకు మరో సెలవు వృధా అయ్యిందన్న మాట. "ఏంటి బాబోయ్, ఏదైనా పెద్ద సెలవు వస్తుందనుకుంటే అది వీకెండ్‌కి పడుతుందే!" అని కొందరు మిమ్స్ పోస్ట్ చేస్తున్నారు.జనవరి 26, మార్చి 31 రెండూ వీకెండ్‌లకు వచ్చేయడంతో ఉద్యోగుల సెలవుల లెక్క తగ్గిపోతోంది. ఇకపై వచ్చే సెలవులైనా వర్కింగ్ డేస్‌లో వస్తాయా? లేకపోతే ఇవి కూడా ఇలాగే మిస్ అవుతాయా? అని ఉద్యోగులు, విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇప్పటికైతే 2025 కొత్త సంవత్సరంలో జనవరిలోనే పాఠశాలలు, కళాశాలలకు చాలా సెలవులు వచ్చాయి. జనవరి నెలలో నూతన సంవత్సరం, సంక్రాంతి, గణతంత్ర దినోత్సవం వంటి అనేక సెలవులు ఉంటాయి. 2025 జనవరి నెలలో మొత్తం 31 రోజులు ఉంటే, 8 రోజులు సెలవులు ఉంటాయి. తెలంగాణ ప్రభుత్వం జనవరి 1న నూతన సంవత్సరం సందర్భంగా సెలవు ప్రకటించింది. కాబట్టి, విద్యార్థులు, ఉద్యోగులు ఆ రోజు పాఠశాలలు ,కార్యాలయాలకు వెళ్లకుండా ఎంజాయ్ చేశారు. జనవరి 13 సోమవారం భోగి పండుగ , జనవరి 14 మంగళవారం సంక్రాంతి సెలవు పండుగ ..మరుసటి రోజు, జనవరి 15న, కనుమ పండుగకు ఐచ్ఛిక సెలవు ప్రకటించారు. మునుపటి రోజు ఆదివారం.. కాబట్టి జనవరి 12 నుండి 15 వరకు వరుసగా నాలుగు రోజులు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు వచ్చాయి. జనవరి 26 గణతంత్ర దినోత్సవం నాడు ప్రభుత్వ సెలవు దినం అవుతుంది.ఆ రోజు ఆదివారం కాబట్టి దానిని సాధారణ సెలవు దినంతో కలిపి ఉంచుతారు. జనవరిలో, 5, 12, 19, 26 తేదీలు ఆదివారాలు కాబట్టి, సాధారణ సెలవు దినం ఉంటుంది. ఈ నాలుగు రోజుల్లో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. మనం ఈ విధంగా చూస్తే, జనవరిలో సెలవులు విద్యార్థులకు, ఉద్యోగులకు బాగానే కలిసొచ్చిందని చెప్పొచ్చు.

# రక్షణ రంగంలో భారత్ మరో మైలురాయి

**ముంబై :** భారతదేశం స్వశక్తితో వ్యూహాత్మక ఆయుధాలను తయారుచేసుకుంటూ ఒక్కో అడుగు ముందుకేస్తుంది. ఈ క్రమంలో సూపర్ సోనిక్ క్షిపణులను అభివృద్ధి చేయడంలో దృష్టిసారించింది.. తద్వారా దేశ రక్షణ రంగం సరికొత్త మైలురాళ్లను చేరుకుంటుంది. తాజాగా.. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో) విభాగమైన హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ల్యాబోరేటరీ (డీఆర్డీఎల్) దీర్ఘకాలిక సూపర్ సోనిక్ కంబస్టన్ రాంజెట్ (స్క్రాంజెట్) ఇంజిన్ ను విజయవంతంగా గ్రౌండ్ టెస్ట్ చేసింది. 120 సెకన్లపాటు గ్రౌండ్ టెస్ట్ జరిపినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. హైపర్ సోనిక్ క్షిపణులు ధ్వని వేగంకంటే ఐదు రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణిస్తాయి. అంటే ఇవి మాక్5 కంటే వేగంగా దూసుకుపోతాయిభారతదేశంలో అత్యంత విశ్వసనీయ ప్రొవైడర్ - స్టార్ హెల్త్‌తో ఆన్‌లైన్‌లో ఆరోగ్య భీమాను కొనండి. పన్ను ఆదా చేయండి, మీ ప్రియమైనవారికి అవసరమైన రక్షణను అందిస్తూ తక్షణమే భద్రత కల్పించండి.డీఆర్డీఓ చేపట్టిన ప్రయోగం విజయవంతం కావడం పట్ల చైర్మన్ డాక్టర్ వీ సమీర్ కామత్, ఇతర బృందాన్ని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అభినందించారు. తరువాతి తరం హైపర్ సోనిక్ క్షిపణుల అభివృద్ధిలో ప్రస్తుతం విజయవంతం అయిన ప్రయోగం ఒక ముఖ్యమైన దశ అని చెప్పారు. డీర్డీవో అధికారి ఒకరు మాట్లాడుతూ.. అమెరికా, రష్యా, చైనా, భాతరదేశం హైపర్ సోనిక్ టెక్నాలజీపై పనిచేస్తున్న దేశాలలో ఉన్నాయని, ఈ సాంకేతికతకు కీలకం స్క్రామ్‌జెట్ ఇంజిన్‌లలో ఉందని తెలిపారు. హైపర్ సోనిక్ క్షిపణులు 5,400 కిలో మీటర్ల (మాక్ 5) వేగంతో ప్రయాణించగలవు. ఇవి ధ్వనివేగం కంటే ఐదు రెట్లు ఎక్కువ. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో భారత్ హైపర్



సోనిక్ క్షిపణుల అభివృద్ధిలో మరో అడుగు ముందుకేసింది.భారతదేశం హైపర్ సోనిక్ క్షిపణులను అభివృద్ధి చేయడంలో వేగంగా ముందడుగు వేస్తోంది. ఈ క్రమంలో భారత్ సరిహద్దు దేశాలైన పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్ వంటి దేశాలకు పెద్ద సవాలు అని చెప్పొచ్చు. ఎందుకంటే.. ఈ క్షిపణులను అత్యంత అధునాతన వాయు రక్షణ వ్యవస్థలతో ట్రాక్ చేయడం, అడ్డుకోవడం దాదాపు అసాధ్యంహైపర్ సోనిక్ క్షిపణుల అభివృద్ధి చాలా సవాళ్లతో కూడుకున్నది. తక్కువ ఎత్తులో ప్రయాణించడం వీటి ప్రత్యేకత. హైపర్ సోనిక్ క్రూజ్ క్షిపణులు స్క్రామ్ జెట్ ఇంజిన్ లను ఉపయోగించుకొని తమ ప్రయాణ మార్గమంతటా హైపర్ సోనిక్ వేగాన్ని ప్రదర్శిస్తాయి. ఈ ఇంజిన్లు లోనికి వచ్చే గాలిని సంపీడనానికి గురిచేసి, ఇంధనంతో మిశ్రమం చేస్తాయి. ఆ తరువాత చెలరేగే ప్రజ్వలనతో సూపర్ సోనిక్ వేగం సాధ్యమవుతుంది.

## ప్రముఖుల రాకతో సందడిగా 'ఎట్ హెూమ్'



-మొదటిపేజీ తరువాయి

కావడంతో అక్కడ రాజకీయ సందడి నెలకొంది. వీరితో పాటు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయమూర్తులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, నారాయణ, నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి సవిత, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, చీఫ్ సెక్రటరీ విజయానంద్, డీజీపీ ద్వారకా తిరుమల రావు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఇతర సీనియర్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

### మంత్రి నారా లోకేశ్‌తో క్రీడాకారులు

ఎమ్మెల్యేలలో యార్లగడ్డ వెంకటరావు, గద్దె రామ్మోహన్, శ్రీరామ్ తాతయ్య, మండలి బుద్ధ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, ప్రజా ప్రతినిధులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, సీపీఐ రామకృష్ణ, వివిధ పార్టీల ముఖ్యనేతలు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. మరోవైపు క్రీడాకారులు అథ్లెట్ వై.జ్యోతి, కోనేరు హంపి తదితరులు హాజరయ్యారు. క్రీడాకారులు మంత్రి నారా లోకేశ్?తో కొద్దిసేపు మాట్లాడారు. సీఎం చంద్రబాబు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్, హైకోర్టు సీజే, పవన్ కల్యాణ్ ఒకే చోట కూర్చుని ఆతిథ్యాన్ని స్వీకరించారు. గవర్నర్, సీఎం కొద్దిసేపు చర్చించుకున్నారు. కార్యక్రమానికి హాజరైన అతిథుల వద్దకు గవర్నర్ స్వయంగా వెళ్లి పలకరించారు. 76వ గణతంత్ర దినోత్సవానికి రాజభవన్ ప్రాంగణాన్ని పూలు, లైటింగ్?తో అందంగా అలంకరించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు సీఎం చంద్రబాబుతో కొద్దిసేపు చర్చించారు. ఎమ్మెల్యేలు వెనిగండ్లరాము, యార్లగడ్డ వెంకట్రావ్, మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు ఒకే చోట ఉన్న సందర్భంలో డిప్యూటీ స్పీకర్ వారి వద్దకు వెళ్లి పలకరించారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైన ఎట్ హెూం కార్యక్రమం గంటన్నరపాటు కొనసాగింది.

## AIతో సీఎం

-మొదటిపేజీ తరువాయి

ఇవ్వడం ద్వారా ఆయన్ను సెంటర్‌గా చేసుకుంటూ అదే వీడియో రికార్డింగ్ స్టార్ట్? చేసింది.చంద్రబాబు నాయుడు సెంటర్ ఫ్రేమ్‌లో ఉండేలా చూసుకుంటూ అవసరమైన సర్దుబాట్లు చేసుకొని వీడియో ఔట్‌పుట్ ఎంతో క్లారిటీగా వచ్చింది. 8 మందితో చేసే పనిని ఈ ఏఐ కెమెరా వ్యవస్థ ద్వారా కేవలం ఒక్కరితోనే చేసేయొచ్చు. ఫలితంగా మీటింగ్? హాల్?లో గజిబిజిగా ఎక్కువమంది అటూ, ఇటూ తిరగాల్సిన అవసరం ఉండదు. ఎటువంటి గందరగోళానికి అవకాశం ఉండదు. నో మ్యాన్ విధానంలో ఆటోమేటిక్‌గా వీడియో రికార్డింగ్ పని? జరుగుతుంది. సొంత నిధులతోనే: వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 2025కి దావోస్‌కి వెళ్లిన వచ్చిన అనంతరం పర్యటన విశేషాలను చెప్పేందుకు చంద్రబాబు శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ ఏఐ సాంకేతికతను వినియోగించారు. మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ ఏఐ సాంకేతిక కెమెరా సిస్టంను ఏర్పాటు చేయించారు. సీఎం క్యాంపు కార్యాలయమైన ఉండవల్లి నివాసంలో ప్రభుత్వ నిధులతో ఈ సిస్టంను ఏర్పాటు చేసే అవకాశమున్నా, మంత్రి లోకేశ్ మాత్రం అందుకు అంగీకరించలేదు. తన సొంత నిధులతోనే ఈ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చారు.

## బీజేపీకి రాజ్యాంగం అంటే గౌరవం లేదు



**విజయవాడ:** ఆంధ్ర రత్న భవన్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. మనకున్న ఈ హక్కులు అన్ని మన రాజ్యాంగం కల్పించినవేనని.. బీజేపీకి రాజ్యాంగం అంటే గౌరవం లేదని విమర్శించారు. స్వాతంత్ర్య పోరులను సయితం అవమానిస్తోందని, అంబేద్కర్‌ను హేళన చేస్తోందని, మహాత్మ గాంధీని విలన్‌గా చూపిస్తున్నారని, మహాత్మను చంపిన గాడ్సేకి గుడులు కడుతున్నారని దుయ్యబట్టారు. మతం,కులం పేరుతో బీజేపీ నేతలు కలహాలు రేపుతున్నారని, దేశ సంపదను ప్రధాని మోదీ దోస్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు.

బాబుది తెరముందు పొత్తు.. జగన్ ది తెరవెనుక పొత్తు..

ప్రధాని మోదీ ప్రభుత్వ సంస్థలను గుప్పిట్లో పెట్టుకొని దుర్వినియోగం చేస్తున్నారని, పార్లమెంట్ వేదికగా అంబేద్కర్‌ను అవమానించారని వైఎస్ షర్మిల విమర్శించారు. ఏపిలో ఉన్న రెండు పెద్ద పార్టీలు తెలుగుదేశం, వైఎస్సార్‌టీపీలు బీజేపీతో జత కట్టాయని, బీజేపీ చేస్తున్న అన్యాయానికి వత్తాసు పలుకుతున్నాయని దుయ్యబట్టారు. విభజన హామీలపై బీజేపీ మోసం చేసినా.. ఆ రెండు పార్టీలు పోటీలు పడి పొత్తులు పెట్టుకుంటున్నాయని మండిపడ్డారు. సీఎం చంద్రబాబుది తెరముందు పొత్తు అయితే.. మాజీ సీఎం జగన్‌ది తెరవెనుక పొత్తు అని అన్నారు.

జగన్ బీజేపీకి గులాం గిరీ

జగన్ బీజేపీకి గులాం గిరీ చేశారని, వైఎస్ఆర్ ఆశయాలను తుంగలో తొక్కారని వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో విమర్శించారు. వైఎస్సార్‌సీపీకి దళితులు ఓట్లు వేసి గెలిపిస్తే వారి పట్ల కృతజ్ఞత భావం లేదన్నారు. బీజేపీ దళితులను అవమనిస్తుంటే కనీసం చిన్న ఖండన కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అంబేద్కర్‌ను అవమానిస్తే వైఎస్సార్‌సీపీ ఎందుకు మౌనం పాటిస్తోందని ప్రశ్నించారు. అంబేద్కర్ విగ్రహాలు పెడితే గౌరవం ఉన్నట్లు కాదని.. పార్లమెంట్ వేదికగా అంబేద్కర్‌కు అవమానం జరిగితే జగన్ మౌనం వహించారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒక్క మాట కూడా మాట్లాడలేదని, అంబేద్కర్‌ను అవమానిస్తే ఆ రెండు పార్టీలకు చీమ కుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు.

బీజేపీతో ప్రమాదం పొంచి ఉంది

బీజేపీతో ప్రమాదం పొంచి ఉందని, బీజేపీ అధికారంలో ఉంటే రాజ్యాంగాన్ని మార్చుతుందని, అలాగే రిజర్వేషన్లు కూడా ఎత్తేస్తుందని వైఎస్ షర్మిల అన్నారు. బీజేపీ ఈ దేశ సంపదను అదానీకి కట్ట బెడుతోందని, ఇంకా అధికారంలో ఉంటే మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతుందని ఆరోపించారు. ఈ దేశానికి మేలు చేసేది కాంగ్రెస్ మాత్రమేనని వైఎస్ షర్మిల అన్నారు.

## సంపాదకీయం

# పౌరసత్వం కోసం ప్రసవాలు

పుట్టిన దేశాన్ని వీడి అమెరికాలోనే శాశ్వత నివాసం ఏర్పర్చుకున్న వాళ్లు కోకొల్లలు. పౌరసత్వం కోసం శతవిధాలా ప్రయత్నించేవాళ్లు తండోపతండాలు. అది వాళ్ల హక్కు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే అమెరికా పౌరసత్వం అనివార్యమని భావించే తల్లిదండ్రులున్నారు. ఆ మోజు ఎంతటి విపరీత ధోరణికి దారితీస్తున్నదంటే భావితరాల భవితవ్యాన్ని కూడా అంధకారంలో పడేసేందుకూ అమెరికాలోని భారతీయ పౌరులు వెనుకాడటం లేదు. అమెరికా కొత్త అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలో పుట్టే పిల్లలకు ఆ దేశ పౌరసత్వం వస్తుంది. దీన్ని యూఎస్ బర్త్ రైట్ సిటిజన్‌షిప్ అంటారు. అమెరికాకు వలసవెళ్లిన వారికి అక్కడ పిల్లలు పుడితే వారికి జన్మతః పౌరసత్వం వస్తుంది. 1868లో అమెరికా 14వ సవరణ ద్వారా ఈ హక్కును ఆ దేశ రాజ్యాంగంలో చేర్చారు. ఇప్పుడు ఆ హక్కును రద్దు చేస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమ వలసదారులకు, తాత్కాలిక వీసాపై అమెరికాకు వచ్చిన వారికి స్థానికంగా పిల్లలు పుడితే తమ దేశం పౌరసత్వం ఇచ్చే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. ఈ విధానం ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి రానున్నది. అంటే ఫిబ్రవరి 19 వరకు పుట్టే పిల్లలకు మాత్రమే పుట్టుకతో అమెరికా పౌరసత్వం వస్తుంది. అందుకే 'అమ్మ' ఆత్మ ఆతృతపడుతున్నది. 7, 8 నెలల గర్భిణులుగా ఉన్న తల్లులు ముందస్తు ప్రసవాలకు సిద్ధమవుతున్నారు. అమెరికా, భారత జాతీయ మీడియా కథనాల ప్రకారం.. అమెరికాలోని భారతీయ మహిళలు 2 రోజులుగా ప్రసూతి దవాఖానలకు పోటెత్తుతున్నారు. 7 నెలలు నిండని గర్భిణులు కూడా ప్రసవాలకు ప్లాన్ చేస్తున్నట్టు అమెరికాలోని భారతీయ వైద్యులు ఆ కథనాల్లో పేర్కొంటున్నారు. అమెరికాలో హెచ్-1బీ, ఎల్-1 తాత్కాలిక వీసాలపై లక్షల మంది జీవిస్తున్నారు. వీళ్లంతా అమెరికాలో శాశ్వత పౌరసత్వం కోసం ఇచ్చే గ్రీన్‌కార్డు కోసం నిరీక్షిస్తున్నారు. 'తాము ఆరేండ్లుగా గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నామని, ఇదొక్కటే తమకు స్థిరత్వాన్ని ఇవ్వగలదు' అని ప్రియా అనే ఓ గర్భిణీ చెప్తున్నది. తమ బిడ్డ అమెరికాలో పుడితే జన్మతః పౌరసత్వం వస్తుందని ఎదురు చూశామని, ట్రంప్ నిర్ణయంతో భయాందోళనకు గురైనట్టు ఆమె తెలిపారు. 'చాలా త్యాగాలు చేసి అమెరికా వచ్చామని, కానీ, ట్రంప్ నిర్ణయంతో దారులు మూసుకుపోయాయనే భావన కలుగుతున్నది' అని ఓ తండ్రి చెప్తున్నారు. 'తమకు పుట్టే బిడ్డ ద్వారా పౌరసత్వం వస్తుందని భావించామని, ఇప్పుడు తమకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది' అని ఆయన ఆందోళన చెందుతున్నాడు. పిల్లల ద్వారా పౌరసత్వం పొందేందుకు ప్రయత్నిస్తున్న తల్లిదండ్రులు చాలా రిస్క్ చేస్తున్నారు. నెలలు నిండకున్నా ముందస్తు ప్రసవాల కోసం సిద్ధమవుతున్నారు. దీనివల్ల తల్లీ బిడ్డలిద్దరికీ ప్రాణాపాయమని వైద్యులు చెప్తున్నా, పౌరసత్వమే జీవిత పరమావధిగా వారు భావిస్తున్నారని అక్కడి వైద్యుల మాటల్లో స్పష్టమవుతున్నది. అంటే, ఇప్పుడు పౌరసత్వం కోసమే ముందస్తు ప్రసవాలకు మొగ్గు చూపడం వల్ల.. ప్రసవం సమయంలో సమస్యలు గట్టెక్కినా.. ఆ తర్వాత పరిస్థితి ఏమిటి? నెలలు నిండని బిడ్డ జీవితాంతం సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యులు చెప్తున్నారు. ఊపిరితిత్తులు ఎదగకపోవడం, నాడీ వ్యవస్థకు సంబంధించిన సవాళ్లతో బాధపడాల్సి ఉంటుంది. ఉన్న ఊరు కన్నతల్లి వంటిదని మన పెద్దలు ఏనాడో చెప్పారు. బతుకుదెరువు కోసం ఎవరు ఎక్కడికి వెళ్లి జీవించినా తిరిగి రావాల్సింది సొంత గ్రామానికే. అయినా ప్రపంచం కుగ్రామమైన నేపథ్యంలో ఎవరు ఎక్కడ నివసిస్తే ఏమున్నది. అమెరికా పౌరసత్వ మోజులో పడి నిండు గర్భిణుల ప్రాణాలను పణంగా పెట్టడం భావ్యమేనా? భావితరాల బతుకు ను ప్రశ్నార్థకం చేయడం సమంజసమేనా? ముమ్మాటికీ కాదు. అందుకే%ా% మాతృ దేశానికి దూరంగా జీవిస్తున్న భారతీయులు కనీసం మాతృత్వపు మాధుర్యాన్నైనా ఆస్వాదించాలి. ఎవరో దయతలచి ఇచ్చే పౌరసత్వం కోసం కన్న పేగును దూరం చేసుకోవద్దు. కడుపు కోతను మిగుల్చుకోవద్దు. అమ్మతనాన్ని అవహేళన చేయవద్దు.

# దావోస్‌లో ఏపీ బ్రాండ్ ధగ ధగ!



రాష్ట్రం అపారమైన అవకాశాలకు గని అని, సుదూర తీరప్రాంతం, విశాలమైన రోడ్లు, విమాన సదుపాయాలు, పోర్టులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని దావోస్ సదస్సులో చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో ఇటీవల తీసుకొచ్చిన పది పాలసీలను ఆయన తెలియజేసారు. ప్రపంచ దేశాలకు చెందిన వ్యాపార దిగ్గజాలు, వివిధ దేశాల అధినేతలు పాల్గొనే దావోస్ ఆర్థిక సదస్సు పెట్టుబడులు ఆకర్షించేందుకు అద్భుతమైన అవకాశమున్న చోటు. ఇది ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచానికి ప్రమోట్ చేసే అద్భుతమైన వేదిక కూడా. మేధావులు, సామాజిక కార్యకర్తలు, ఆర్థిక నిపుణులు, పాత్రికేయులు పాల్గొనే అతి కీలకమైన సమావేశం అది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం రాష్ట్రంలో పెట్టుబడులు సాధనే లక్ష్యంగా దావోస్‌లో వివిధ వ్యాపార దిగ్గజాలతో వరుస భేటీలయ్యారు ముఖ్యమంత్రి చంద్రబాబు. రాష్ట్రానికి వీలైనన్ని పరిశ్రమలు తీసుకురావడమే లక్ష్యంగా, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచానికి ప్రమోట్ చేసి రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరించారు. భారీ పెట్టుబడులను ఆకర్షించి పారిశ్రామికీకరణను కొత్త పుంతలు తొక్కించేందుకు, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక, వ్యాపార దిగ్గజాలను ఒప్పించి రాష్ట్రానికి రప్పించడానికి భగీరథ ప్రయత్నం చేశారు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేష్. రాష్ట్రం పెట్టుబడులకు అత్యంత అనుకూల ప్రదేశమని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేందుకు ప్రతిష్ఠాత్మకమైన ప్రపంచ ఆర్థిక ఫోరాన్ని చంద్రబాబు వేదికగా చేసుకున్నారు. ఏపీ అపారమైన అవకాశాల గని అని, వ్యవసాయ ఉత్పత్తులు, 1,053 కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం, విశాలమైన రోడ్లు, విమాన సదుపాయాలు, పోర్టులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని, దేశంలో మరెక్కడా లేని విధంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని తెలియజేశారు. రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలకు 15 రోజుల్లో అన్ని అనుమతులు మంజూరు చేసేందుకు ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేస్తామని పెట్టుబడిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం ఇటీవల తీసుకొచ్చిన పది పాలసీలను దావోస్ వేదికగా ఆయన తెలియజేసారు. 74 ఏళ్ల వయస్సులో దావోస్‌లో గడ్డ కట్టే చలిలోనూ పర్యటించి దేశాధినేతలతోను, బిల్‌గేట్స్ నుంచి టాటా గ్రూపు చంద్రశేఖరన్, తదితర వ్యాపార దిగ్గజాలతో సమావేశమవుతూ ఐటీ నుంచి ఏఐ వరకు, విస్తృతంగా పెట్టుబడుల వేట సాగించారు చంద్రబాబు. మాజీ సీఎం జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో దావోస్ సదస్సులో ఆంధ్రప్రదేశ్ అడ్రస్ గల్లంతు అయి రాష్ట్రం నుంచి దావోస్‌లో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడం మాట దేవుడెరుగు. ఉన్న కంపెనీలను వెళ్లగొట్టడమే పనిగా జగన్ ప్రభుత్వం అనుసరించిన నిరంకుశ విధానాలు, కొత్త పెట్టుబడులకు ఉన్న అవకాశాలను దూరం చేశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి దావోస్ సదస్సులో మళ్లీ ఏపీ బ్రాండ్ ధగ ధగ లాడింది. రాష్ట్రానికి పెట్టుబడులను, కంపెనీలను ఆకర్షించే లక్ష్యంతో దావోస్ పెవిలియన్లలో వరస సమావేశాలతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ విరామం లేకుండా గడిపారు. గ్రీన్, క్లీన్ ఎనర్జీకి ఏపీ గమ్యస్థానంగా మారిన తీరును దిగ్గజ కంపెనీలకు చెప్పి, సానుకూల స్పందనను రాబట్టారు. హైడ్రోజన్ హబ్, డేటా సెంటర్లు, గూగుల్ క్లౌడ్ విస్తరణ, వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు పరిశ్రమ హోదా, ఇలా రాష్ట్రాభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తున్న విధానాన్ని దావోస్ వేదికపై ప్రపంచ ప్రతినిధులకు పరిచయం చేశారు. స్విస్‌మెన్, ఓర్లికాన్, ఆంగ్స్ ఫిస్టర్, స్విస్ టెక్స్‌టైల్స్ యాజమాన్యాలతో చంద్రబాబు బృందం వరుస సమావేశాలు నిర్వహించింది. రాష్ట్రంలో రీసెర్చి సెంటర్ ఏర్పాటుకు స్విస్‌మెన్ సంస్థ ముందుకొచ్చింది. ఇన్నోవేషన్ హబ్‌లు, ఇంక్యుబేటర్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అడ్వాన్స్‌డ్ కోటింగ్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు ఓర్లికాన్ మొగ్గుచూపింది. ఏఐ సెంటర్ల ఏర్పాటుపైనా ఆసక్తిని చూపింది. అడ్వాన్స్‌డ్ సీలింగ్ సొల్యూషన్ ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలని ఆంగ్స్ ఫిస్టర్ సంస్థను చంద్రబాబు కోరగా, ఆ సంస్థ సానుకూలత వ్యక్తం చేసింది. రీసెర్చి టెక్స్‌టైల్ యూనిట్ ఏర్పాటుకు స్విస్ టెక్స్‌టైల్స్ కంపెనీ ముందుకొచ్చింది. ప్రపంచంలోనే అదిపెద్ద సముద్రయాన రంగ సంస్థ మార్స్క్... ఏపీలోని సముద్రతీరం పట్ల ఆసక్తి చూపి త్వరలోనే పర్యటనకు వస్తామని హామీ ఇచ్చింది. విశాఖ, తిరుపతిలో కార్యకలాపాలను ప్రారంభించాలన్న చంద్రబాబు ఆహ్వానానికి సిస్కో సానుకూలంగా స్పందించింది. తిరుపతి, విశాఖలో సెమికండక్టర్ యూనిట్లను స్థాపించే విషయమై త్వరలో నిర్ణయం తెలుపుతామని దక్షిణ కొరియాకు చెందిన ఎల్జీ కెమ్ సంస్థ సీఈవో పిన్‌హక్ చియోబ్ తెలిపారు. కార్ల్స్‌బెర్గ్ గ్రూప్ రాష్ట్రంలో పండ్ల రసాలు, శీతల పానీయాలు, బీర్లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు సానుకూలత ప్రదర్శించింది. విశాఖ, అమరావతిలో గూగుల్ డిజైన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరగా, గూగుల్ క్లౌడ్ సీఈవో కురియన్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రాన్ని పెట్రోలియం హబ్‌గా మార్చే దిశలో భాగస్వాములమవుతామని పెట్రోనాస్ సంస్థ తెలిపింది. రాష్ట్రంలో పెప్సికో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చైర్మన్ స్టీవెన్ కెహో సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆరోగ్య, విద్యారంగాల్లో కొత్త ఆవిష్కరణలకు ఏపీని కేంద్రంగా మార్చే అంశాన్ని మిలిండా గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌ను కలిసి చంద్రబాబు చర్చించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెల్త్ ఇన్నోవేషన్ డయాగ్నోస్టిక్స్‌ను నెలకొల్పేందుకూ, ఏఐ వర్సిటీ ఏర్పాటు చేసేందుకు బిల్‌గేట్స్ సమ్మతి తెలిపారు. యువతకు బంగారు బాటలు వెయ్యాలని దావోస్‌లో పెట్టుబడుల కోసం వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస భేటీలయ్యారు ఐటీ మంత్రి లోకేష్. యువతకు ఉపాధి అవకాశాల్ని మెరుగుపరచాలనే లక్ష్యంతో నాలుగు రోజులు విరామం లేకుండా దావోస్‌లో పర్యటించి పలువురు పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులు, సీఈఓలతో వరుసగా సమావేశమయ్యారు. కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్‌తో మంత్రి లోకేష్ సమావేశం అయి ఏపీని ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన రంగంలో డీప్ టెక్ హబ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించాం అనే విషయాన్ని స్పష్టం చేశారు. విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాల్లో 22 లక్షల చదరపు అడుగుల కోవర్కింగ్ స్థలం అందుబాటులో ఉంది. కాగ్నిజెంట్ వృద్ధి వ్యూహాలు, ప్రాంతీయ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా విశాఖపట్నం లాంటి ద్వితీయశ్రేణి నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభించమని లోకేష్ కోరగా, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు రవికుమార్. సంస్థలో పనిచేస్తున్న 80వేల మంది ఉద్యోగులను టైర్-1, టైర్-2 నగరాలకు మార్చేందుకు ప్రణాళికలు ప్రకటించాం. గ్లోబల్ స్కిల్ ఇనీషియేటివ్‌లో భాగంగా జెనరేటివ్ ఏఐ అధునాతన సాంకేతిక నైపుణ్యాల్లో 10 లక్షల మందికి సాధికారత కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అట్లాగే విద్యారంగంలో ప్రపంచస్థాయి శిక్షణకు సహకరించాలని వరల్డ్ ఎకనమిక్ ఫోరం న్యూఎకానమీ, సొసైటీ విభాగం ఎంగేజ్‌మెంట్, ఆపరేషన్స్ విభాగాధిపతి రవి గుత్తాను మంత్రి లోకేశ్ కోరారు. ఏపీలో విద్యారంగంలో గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించేందుకు సహకరించాలని, పరిశ్రమల పరంగా అధునాతన శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేయమని కోరారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆంధ్రప్రదేశ్‌ను ఛాంపియన్‌గా నిలపాలని లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు కాలంతో పోటీ పడుతున్నారు.

# పెట్టుబడుల గమ్యస్థానం తెలంగాణ




రానున్న రోజుల్లో హైదరాబాద్ మహానగరాన్ని ఏ విధంగా తీర్చిదిద్దబోతున్నాం. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్, మధ్యలో రేడియల్ రోడ్లు, పారిశ్రామిక క్లస్టర్లు... ఇలా అనేక అంశాలకు సంబంధించి తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను ముఖ్యమంత్రి దావోస్ వేదికగా ఆవిష్కరించారు. దావోస్ కేంద్రంగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు-2025లో గత ఏడాదితో పోలిస్తే తెలంగాణకు నాలుగు రెట్లు అధికంగా పెట్టుబడులు పెట్టడానికి వివిధ సంస్థలు ఆసక్తి చూపించాయంటే ఆ ప్రయత్నంలో ప్రభుత్వం భారీ విజయం సాధించినట్టే. నాయకత్వ కృషి ఎంతో ఉంటే తప్ప పెట్టుబడులు రావు. నమ్మకం కలగందే పెట్టుబడులకు సంస్థలు కూడా ముందుకు రావు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 'తెలంగాణ రైజింగ్' అన్న నినాదంతో అనుసరిస్తున్న విధానాలు రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు దోహదపడ్డాయి. అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం దావోస్‌లో అడుగుపెట్టిన క్షణం నుంచి నిరంతరం శ్రమించింది. పరిమితమైన సమయంలో క్షణం తీరికలేకుండా ప్రపంచ దిగ్గజాలతో సంప్రదింపులు జరిపింది. ముఖ్యమంత్రి మాటల్లో చెప్పాలంటే 'తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలిగించడం ద్వారా అధిక పెట్టుబడులను ఆకర్షించాం. గత ఏడాది మా ప్రభుత్వం రూపొందించిన అనుకూల విధానాలే దీనికి కారణం' అన్నారు. ఆయన ప్రయత్నాల ఫలితంగానే ఈ రోజు తెలంగాణ పేరు ప్రపంచ వేదికలపై వినిపిస్తోంది. ఏకంగా రూ.1,78,950 కోట్ల విలువ చేసే పెట్టుబడులు తెలంగాణకు రావడమంటే ఆషామాషీ కాదు. వీటితో దాదాపు 50 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభిస్తుంది. దావోస్‌లో 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్' అన్న అంశంపై వరల్డ్ ఎకనమిక్ ఫోరం నిర్వహించిన సదస్సులోను, 'రీఇమేజింగ్ అర్బన్ మొబిలిటీ%-%ట్రెండ్స్, ఇన్నోవేషన్స్ అండ్ ఆపర్చునిటీస్%-%2030 అండ్ బియాండ్' అన్న అంశంపై భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), హెచ్‌ఎంసీ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులోను తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలు, లక్ష్యాలను ప్రపంచ దిగ్గజాల ముందు ముఖ్యమంత్రి స్పష్టంగా ఆవిష్కరించారు. కమ్యూనికేషన్ రంగంలో శరవేగంగా వచ్చిన మార్పులను అందిపుచ్చుకోవడంలో రాజీవ్‌గాంధీని, సరళీకృత ఆర్థిక విధానాలతో దేశానికి మార్గనిర్దేశకులైన పీవీ నరసింహారావును, అలాగే హైదరాబాద్‌లో ఐటీ రంగ విస్తరణకు చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యలు, హైదరాబాద్ ఒక మహానగరంగా విస్తరించడానికి విస్తృతమైన మౌలిక సదుపాయాలు కల్పించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లాంటి నేతలు చూపిన బాటను కొనసాగిస్తామని, దేశాన్ని ఐదు ట్రిలియన్ల ఎకానమీగా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి సంకల్పానికి తెలంగాణ వంతుగా నిలబడతామనీ దావోస్‌లో రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. మూడు పార్టీలకు చెందిన ముగ్గురు ముఖ్యమంత్రులు ఒకే వేదికపైన మాట్లాడిన సందర్భంలో కూడా రేవంత్‌రెడ్డి తన వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. సరిహద్దు రాష్ట్రాలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, అభివృద్ధి విషయంలో ప్రపంచంతో పోటీపడతామన్నారు. మూడు రాష్ట్రాల నుంచి గలగలా పారే కృష్ణా, గోదావరి నదులతో పోలుస్తూ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా మూడు రాష్ట్రాలూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించిన నాయకుడు రేవంత్‌రెడ్డి. ఆ మాటలు ప్రపంచ ఆర్థిక సదస్సు మోడరేటర్ సమీర్ శరణ్‌నే కాదు.. ఎంతో మంది ప్రముఖులు, పారిశ్రామికవేత్తలను కూడా ఆకర్షించాయి. మూడు రోజుల దావోస్ పర్యటనలో రేవంత్‌రెడ్డి ఇదే ఒరవడిని కొనసాగించారు. పెట్టుబడులను ఆకర్షించడంలో ఆయన స్పీడ్ ఒక అసెట్. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం గత ఏడాది కాలంలో దూరదృష్టితో అమలు చేస్తున్న ప్రణాళికలు పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగిస్తున్నాయి. కొత్తగా డేటా సెంటర్ల ఏర్పాటు లేదా విస్తరణకు ఆయా సంస్థలు చొరవ చూపడానికి అదీ ఒక కారణమే. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో శరవేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను అందరికన్నా ముందుగా అందిపుచ్చుకుని హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి సదస్సును నిర్వహించడమే కాకుండా, ప్రత్యేకంగా ఏఐ సిటీ నిర్మించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆ రంగంలో విస్తరించాలన్న సంస్థల్లో విశ్వాసాన్ని పెంచింది. హైదరాబాద్ కేంద్ర బిందువుగా డేటా సెంటర్లను నెలకొల్పడానికి ఐటీ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయంటే, అందుకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా నిలుస్తున్న తీరు ఆయా సంస్థలకు నమ్మకం కలిగిస్తున్నది. ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీల మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచి ఫలితాలను అందిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు పెరగడం, కాలుష్య కారక వాహనాలను తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఎంతగా కట్టుబడి ఉందో అర్థమవుతుంది. మూసీ ప్రక్షాళన కూడా హైదరాబాద్ నగర భవిష్యత్తుకు ఒక బృహత్తరమైన ప్రణాళిక. కొందరు కావాలని కూల్చివేతలుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేసినప్పటికీ మరో వంద సంవత్సరాల పాటు హైదరాబాద్ కాలుష్య రహిత, పర్యావరణ హితమైన నగరంగా విలసిల్లాలని చేపట్టిందే మూసీ పునరుజ్జీవం. కాలుష్య కాసారంగా మారిన మూసీని ప్రక్షాళన చేసి, ఈ మహానగర నీటి అవసరాలను తీర్చడమే కాకుండా, నల్గొండ ప్రజల సాగునీరు వంటి అనేక విషయాలతో ముడిపడిన అంశాలను దావోస్ వేదికగా ముఖ్యమంత్రి వివరించారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ మహానగరాన్ని ఏ విధంగా తీర్చిదిద్దబోతున్నాం. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్, మధ్యలో రేడియల్ రోడ్లు, పారిశ్రామిక క్లస్టర్లు... ఇలా అన్ని విషయాలకు సంబంధించి తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను ముఖ్యమంత్రి దావోస్ వేదికగా ఆవిష్కరించారు.

# ప్రతి పౌరుడు దేశ సేవకు, దేశవృత్తికి పాటుపడాలి

## జిల్లా కమిటీ సభ్యులు బి గోవిందు

గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:ఈరోజు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కార్యాలయం ముందు 76 వ గణతంత్ర దినోత్సవ జాతీయ జండాను ఘనంగా జరుపుకోవడం జరిగింది. జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి %జూ% గోపీనాథ్ అధ్యక్షతన

జరిగిన పతాకావిష్కరణ కు ముఖ్య ఆహ్వానితులుగా సిపిఐ సీనియర్ నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ బి గోవిందు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం వీరభద్రస్వామి, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి బి మహేష్ సిపిఐ రూరల్ కార్యదర్శి రాము రాయల్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శ పి సీ కుల్లాయప్ప ఆహ్వానితులుగా చేయడం జరిగింది అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ బి గోవిందు పతాకావిష్కరణ చేయడం జరిగింది సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ బి గోవిందు మాట్లాడుతూ.

అసలు గణతంత్ర దినోత్సవంను జనవరి 26నే ఎందుకు జరుపుకోవాలి?

దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం సిద్ధించింది.. అలాగే 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. కాబట్టి ప్రతి సవంత్సరం అదే తేదీన గణతంత్ర దినోత్సవంను జరుపుకుంటున్నామని భావిస్తారు. అయితే దీని వెనుక బలమైన కారణం ఉంది. వాస్తవానికి భారత రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26నే ఆమోదించారు. దీనిని అమలు చేసే తేదీకి ఒక ప్రాముఖ్యత ఉండాలనే ఉద్దేశంతో రెండు నెలలు ఆగారు.జనవరి 26, 1950 నుంచి బ్రిటీష్ కాలంనాటి భారత ప్రభుత్వ చట్టం 1935 రద్దయ్యి, భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది మన దేశ విధివిధానాల రూపకల్పన లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశానికి రాజ్యాంగం ఉండాలని భావించిన నాటి దార్శనికులు, మేధావులు రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటుచేశారు. దీనికి అధ్యక్షుడిగా డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌ను ఎన్నికోగా, రాజ్యాంగ రచనా ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా డాక్టర్ అంబేద్కర్ ఛైర్మన్‌ను నియమించారు.

రాజ్యాంగ రచన ప్రజాస్వామ్య విధానంలో ఉండేలా భిన్నత్వ ప్రజలలోని సమానత్వ భావనను పెపొందించేలా చివరి వరకు తానే బాధ్యత గా తీసుకుని ప్రపంచ దేశాలకే ఆదర్శమైన అతి



పెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించారు. అనేక సవరణల అనంతరం, 1949 నవంబర్ 26న దీనిని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది.

భారత రాజ్యాంగాన్ని రూపొందించేందుకు రెండు సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల కాలం పట్టింది. రాజ్యాంగ రచనకు మొత్తం రూ.64 లక్షలు ఖర్చయ్యింది.

బ్రిటీష్ పరిపాలన నుంచి విముక్తి పొందిన తరువాత భారత పౌరులందరిని ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో నడిపించడానికి, స్వాతంత్ర్య పోరాట ఆశయాలను నెరవేర్చడానికి, భారత రాజ్యాంగం జనవరి 26, 1950 నుంచి అమలులోకి వచ్చింది. ఈ రోజున భారత ప్రజలందరూ సంపూర్ణ స్వేచ్ఛ, సమానత్వం, లౌకికతత్వం, న్యాయాన్ని పూర్తి స్థాయిలో ఒక హక్కుగా పొందడం జరిగింది కుల, మత, వివక్ష లేకుండా ప్రజలందరికీ ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో కల్పించారు. అలాగే ప్రతి పౌరుడు దేశసేవకు, దేశాభివృద్ధికి పాటుపడేలా బాధ్యతలను కలిగి ఉండాలని అందులో పొందుపరిచారు. వీటన్నింటికీ గుర్తుచేసుకుంటా రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజే గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటాం.

ప్రతీ పౌరుడు హక్కులను ఉపయోగించుకుంటూ, బాధ్యతలను విస్మరించకుండా దేశసేవకు, దేశాభివృద్ధికి పాటుపడాలని అలాగే ప్రతి చోట బాబా సాహెబ్ అంబేద్కర్ గారి ఫోటో జెండా వందన కార్యక్రమంలో ఉంచాలని కోరుకుంటూ .

ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు. పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్.

సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామాంజనేయు

సిపిఐ నాయకులు దేవేంద నూర్ భాషా వలి భాష ప్రజానాట్యమండలి పట్టణ కార్యదర్శి ప్రసాదు పుల్లయ్య. ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు వినోదో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శ మనీ రోహిత్ , మరియు, ఏ ఐ టి యు సి సంయుక్త కార్యదర్శి చిదాంబరం తదితర నాయకులు పాల్గొనడం జరిగింది.

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయొద్దు






ఎంవిఐ రాజబాబు, రూరల్ సిఐ ప్రవీణ్

**గుంతకల్లు టౌన్ ప్రజా జ్యోతి: :** ద్విచక్ర వాహనదారులందరూ ఖచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనాలు డ్రైవింగ్ చేయండి. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని గుంతకల్లు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నీలం వెంకట రాజాబాబు, గుంతకల్లు రూరల్ ఎస్సై రాఘవేంద్రప్ప ద్విచక్ర వాహనదారులకు హెచ్చరించారు. ఆదివారం గుంతకల్ రూరల్ పోలీస్ స్టేషన్ దగ్గర జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి వాహనాలకు రికార్డులు సక్రమంగా లేని కారణంగా వాహనాలకు మరియు హెల్మెట్ ధరించని వారికి జరిమానాల విధించారు. ఈ సందర్భంగా వాహనదారులందరికీ రోడ్డు భద్రత గురించి సూచనలు సలహాలు ఇచ్చారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్త తీసుకోవాలని వారికి అవగాహన కల్పించారు. వాహనదారులు ప్రయాణ సమయంలో కచ్చితంగా వాహనాలకు సంబంధించిన రికార్డులు ఇన్సూరెన్స్ పొల్యూషన్ ఆర్ సి డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని తెలియజేశారు. ప్రజలందరూ సురక్షితంగా ఉండాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సూచనలు సలహాలు చేస్తూ ప్రతి సంవత్సరము వారం రోజులపాటు రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తుందని గుర్తు చేశారు. వాహనాలు అతివేగంతో అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడ%శీ% వలన అదుపుతప్పి ప్రమాదాలు జరిగి చనిపోతే, డ్రైవింగ్ చేసిన వారితో పాటు ప్రయాణం చేసే వాళ్ళు కూడా చనిపోవడం వలన వారి కుటుంబ సభ్యులు దిక్కులేని వారిగా జీవించాల్సిన పరిస్థితి వస్తుందని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయం సిబ్బంది, రూరల్ ఏ ఎస్ ఐ శ్రీనివాసులు, పోలీసులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదిద్దాం...పర్యావరణాన్ని కాపాడదాం

ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ఆడపిల్ల సేవా సొసైటీ చైర్మెన్ మడ్డి లావణ్య



**పొందూరు , జనవరి 26:** పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి భాధ్యత అని ఆడపిల్ల సేవా సొసైటీ చైర్మెన్,సచివాలయం 1 మహిళా పోలీస్ మడ్డి లావణ్య తెలిపారు. పొందూరు మండల కేంద్రంలో ఆడపిల్లకు విద్యను అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఆడపిల్ల స్టడీ సెంటర్ లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవాళికి తీవ్ర హాని కలిగిస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని కట్టడి చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. భావితరాలకు బంగారు భవిష్యత్ ను అందించాలంటే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. గత మూడు నెలలుగా విద్యార్థులు వారి రోజూ వారి వాడుకలో ప్లాస్టిక్ వేస్ట్ ను కలెక్ట్ చేస్తున్న క్రమంలో 76 వ గణతంత్ర వేడుకలు, అంతర్జాతీయ విద్య దినోత్సవం అమద్రభ్కగా ప్లాస్టిక్ ఎక్కువ గా సేకరించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

## పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్ దాడులలో బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు, 9 మద్యం సీసాల స్వాధీనం.

**పాలకొల్లు జనవరి 26 ప్రజాజ్యోతి న్యూస్ :** పాలకొల్లు ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన దాడులలో పాలకొల్లు మండలం, పూలపల్లి లో జి సుబ్బారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్దనుండి 9 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకోవడం జరిగిందని.ఎక్సైజ్,ప్రోహిబిషన్ స్టేషన్ సిఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మా పరిధిలో అక్రమంగా ఎవరైనా బెల్టు షాపులు నిర్వహించిన, ఇతర మాదకద్రవ్యాలు సరఫరా చేసిన అటువంటి వారిని



పకడ్బందీగా పట్టుకుని చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.దేశ ప్రజలంతా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిమగ్నమై భారతదేశానికి గౌరవంగా ఒకరోజు మద్యాన్ని నిషేధిస్తే అటువంటి పవిత్రమైన రోజున కూడా ఇలా దొంగ చాటుగా మద్యాన్ని విక్రయించడం దౌర్భాగ్యమైన చర్యాఅని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ దాడులలో ఎస్ఐలు పి.మహేష్, జి.రఘు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ అవార్డు నా వృత్తిపట్ల మరింత బాధ్యతను పెంచింది

ఎక్సైజ్ ప్రొహిబిషన్ సిఐ మద్దాల శ్రీనివాస్.



**పాలకొల్లు జనవరి 26 ప్రజాజ్యోతి న్యూస్ :** మెరిటోరియస్ అవార్డు అందుకోవటం తనకు ఎంతో ఆనందాన్ని సంతోషాన్ని ఇచ్చిందని, అలాగే నా వృత్తి పట్ల మరింత బాధ్యతను పెంచిందని పాలకొల్లు ఎక్సైజ్, ప్రొహిబిషన్ స్టేషన్ సిఐ మద్దాల శ్రీనివాస్ అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం మంగళగిరి ఎక్సైజ్ శాఖ హెడ్ ఆఫీస్ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలలో ఎక్సైజ్ శాఖ పాలకొల్లు స్టేషన్ పరిధిలో ఉత్తమ సేవలను అందించినందుకు గాను సీఐ మద్దాల శ్రీనివాసు కు మెరిటేరియస్ అవార్డును ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ ఐఏఎస్ ఆయన చేతుల మీదగా అందించారు.ఈ సందర్భంగా సిఐ మద్దాల శ్రీనివాస్ మాట్లాడుతూ తన వృక్ష రీత్యా నిర్వహించే ఉద్యోగ బాధ్యతలలో ఎటువంటి ఒత్తిళ్లకు లొంగేది లేదని, కష్టపడి పనిచేసి తన శాఖకు,తన వృత్తికి మంచి పేరు తీసుకురావడమే కర్తవ్యం గా పని చేస్తానే తప్ప ఎటువంటి అవకతవకలను ఉపేక్షించేది లేదని అన్నారు. అలాగే తన ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడానికి సహకరించిన తన కుటుంబ సభ్యులకు, మరియు ఎక్సైజ్ ప్రొవిషన్ స్టేషన్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.సిఐ మద్దాల శ్రీనివాస్ సేవలను గుర్తించి మెరిటేరియస్ వార్డును ప్రభుత్వం అందించడం పట్ల పాలకొల్లు ఎక్సైజ్ ప్రొహబిషన్ స్టేషన్ సిబ్బంది ఎస్సైలు రఘు, మహేష్, కానిస్టేబుల్స్, తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు.

## చెరువులను శుభ్రం చేయించి వ్యవసాయానికి సాగు,తాగునీరు అందించాలి...సీపీఎం

సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప



**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి :** స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో శాఖ కార్యదర్శుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి శ్రీనివాసులు మాట్లాడుతూ దోనముక్కల, పులుకుటుపల్లి ,నల్లగొండ నాగసముద్రం, అయ్యవారిపల్లి, మరియు గుత్తి, పామిడి మండలాల్లో ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులను పూడిక మరియు ముళ్ల కంపులను తొలగించి, గండికి గురు కాకుండా తగు అభివృద్ధి చర్యలు తీసుకొని రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ మరియు కసాపురం పిల్ల కాలువ ద్వారా చెరువులను చిన్నచిన్న కుంటలకు నీరు నింపుకుంటే వ్యవసాయాన్ని సంవత్సరానికి మూడు పంటలు పండించే విధంగా శక్తివంతమైన సారవంతమైన భూములు మన ప్రాంతంలో అనేక చోట్ల ఉన్నాయి కానీ అనేక వసతులు ఉన్న వాటిని అభివృద్ధి చేయకుండా కాలయాపన చేసే పరిస్థితి కనపడుతుంది. కావున ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు ప్రజాప్రతినిధులు చెరువులను మొత్తం క్లీన్ చేయించి నీరు నిలువ ఉంచుకునే విధంగా తగు చర్యలు చేపట్టి రైతాంగాన్ని కాపాడే విధంగా తోడ్పాటు అందించాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నాం లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్ సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కసాపురం రమేష్,జగ్గలి రమేష్,రంగమ్మ,సురేంద్ర, పట్టణసభ్యులు రాము నాయక్,ఓబులేసు,జయమ్మ,సుగుణమ్మ, జగదీష్, లక్ష్మీ, సుంకన్న,బాషా ,సమేల్ తదితరులు పాల్గొన్నారు.

## పామిడి గవర్నమెంట్ హాస్పిటల్ లో ఘనంగా గణతంత్ర దినోత్సవం వేడుకలు



**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** మండల పరిధిలోని గవర్నమెంట్ హాస్పిటల్ నందు హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ పూజారి లక్ష్మీదేవి, చిలకల రాజగోపాల్, డాక్టర్లు మరియు హాస్పిటల్స్ సిబ్బంది అంతా కలసి గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

## కొత్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంతో పాటు పలు చోట్ల గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న లోతుగడ్డ తులసీ వరప్రసాదరావు



**కొత్తూరు జనవరి26, ప్రజా జ్యోతి న్యూస్** కొత్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.అలాగే కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో గణతంత్ర దినోత్సవ వేడుకలు హాజరయ్యారు.ఈ ఈ కార్యక్రమాల్లో లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు పాల్గొని ఆయన మాట్లాడుతూ భారతదేశంలో గణతంత్ర దినోత్సవాన్ని భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజుగా జరుపుకుంటారనీ,ప్రతి సంవత్సరం జనవరి 26ను భారత గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటారని,1950 జనవరి 26న భారత ప్రభుత్వ చట్టానికి (1935) బదులు భారత రాజ్యాంగం దేశపరిపాలనకు మార్చడాన్ని భారత గణతంత్ర దినోత్సవం అంటారని,1949 నవంబరు 26న రాజ్యాంగం ఆమోదం పొందగా భారతదేశం స్వతంత్ర గణతంత్రంగా ఆవిర్భవించేందుకు 1950 జనవరి 26లో దీనిని ఒక ప్రజాతంత్ర పరిపాలన పద్ధతితో పాటుగా అమలులోకి తీసుకురావాలని నిర్ణయించారనీ,జనవరి 26 నే ఇందుకు ఎంచుకోవడానికి చారిత్రికమైన కారణం ఉందనీ, 1930లో భారత జాతీయ కాంగ్రెస్ పూర్ణ స్వరాజ్‌ని ఆ రోజే ప్రకటించుకుందనీ, అందుకు సంపూర్ణ స్వరాజ్యమైన రాజ్యాంగం అమలు ఈ రోజున చేయాలని నిర్ణయించారనీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు తెలియజేశారు. లోతుగెడ్డ తులసి వరప్రసాద్ రావు మాట్లాడుతూ అప్పటి నుండి గణతంత్ర దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ప్రభుత్వం, ప్రజలు ఘనంగా నిర్వహిస్తుంటారు. జనవరి 26 తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ సెలవు దినంగా ప్రకటిస్తారు. దేశరాజధాని న్యూఢిల్లీలో జెండా ఎగరేసి ప్రసంగిస్తారు. విశాలమైన గ్రౌండ్ లో దేశంలోని ఎన్నెన్నో రాష్ట్రాలను, ప్రభుత్వ శాఖలను ప్రతిబింబించేందుకు వీలుగా వివిధ రాష్ట్రాల చిహ్నాలతో పెరేడ్ చేయిస్తారనీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మరియు మండల అధికారులతో పాటు సిపిఎం నేషనల్ కౌన్సిల్ మెంబర్ చల్ల ధర్మరావు, ,పడాల వెంకటకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచులు,స్కూల్ కమిటి చైర్మన్లు టిడిపి నాయకులు, కార్యకర్తలు మొదలగువారు ఉన్నారు.


## ఉత్తమ ఉపాధ్యాయ స్పెషల్ కేటగిరి అవార్డుఅందుకున్న భ్రమరాంభ.

పోడూరు, జనవరి 26,ప్రజాజ్యోతి న్యూస్. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం గుమ్ములూరు ఎంపీపీ స్కూల్ మెయిన్ ప్రధానోపాధ్యాయులు జి లక్ష్మి భ్రమరాంబకు ఉత్తమ ఉపాధ్యాయ స్పెషల్ కేటగిరి అవార్డు ను గణతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ సదలవాడ నాగరాణి జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి ఆదివారం అందజేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఉత్తమవిద్యతో పాటు వివిధ సామాజిక సేవలు అందించినందుకు ఉత్తమ ఉపాధ్యాయ స్పెషల్ కేటగిరి అవార్డును అందజేశారు పశ్చిమగోదావరి జిల్లాభీమవరం ప్యారేడ్ గ్రౌండ్ లో ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ అవార్డుఅందజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా సూపరిడెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీమ్ అస్మి తదితరులు పాల్గొన్నారు తుఫాన్ బాధితులకు అప్పటి శిశు సంక్షేమ శాఖ మంత్రి పీతల సుజాత కు పదివేల రూపాయలు చెక్కును అందజేశారు కరోనా సమయంలో వలస కూలీలకు బియ్యం నిత్యవసర వస్తువులు అందించారు వయోజనులను విద్యావంతులు చేయుటలోనూ బడి మాని బయట తిరిగే పిల్లలకు తిరిగి పాఠశాలలో అనేకమందిని చేర్పించారు మహిళా దినోత్సవ సందర్భంగాకులాలకతీతంగా మహిళలకు వన సమారాధనలు ఏర్పాటు చేసి ఐక్యతను చాటుకున్నారు ఇటువంటి అనేక కార్యక్రమాలు చేసినందుకు జిల్లా అధికారులు గుర్తించి ఈ అవార్డును ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ కు అందజేశారు.



## సాంకేతిక లోపాల వల్ల సాధారణ సభ్యత్వం బదులుగా శాశ్వత సభ్యత్వం..

**బాదిత కుటుంబానికి 1,00,000 రూపాయలు అకౌంట్ ట్రాన్స్ఫర్ చేసిన ఎమ్మెల్యే : ఎంజీఆర్**



**మెలియాపుట్టి జనవరి26, ప్రజా జ్యోతి న్యూస్** తెలుగుదేశం పార్టీ చేపట్టిన సభ్యత నమోదు కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గంలో మెలియాపుట్టి మండలం వసుంధర గ్రామనికి చెందిన లక్ష్మి నాయక్ అనే వ్యక్తి సభ్యత్వ నమోదు సాంకేతిక సమస్యల వల్ల సాధారణ సభ్యత్వం బదులుగా శాశ్విత సభ్యత్వం నమోదై ఆమె అకౌంట్ నుంచి లక్ష రూపాయలు పార్టీకి వెళ్లిన విషయము అందరికీ తెలిసినదే. సభ్యత్వ రుసుము చెల్లించిన వెంటనే జరిగిన తప్పిదాన్ని శాసనసభ్యులు వారి కార్యాలయానికి ఫిర్యాదు చేయగా తక్షణమే స్పందించి శాసనసభ్యులు దృష్టిలో పెట్టగా, శాసనసభ్యులు మామిడి గోవిందరావు పార్టీ కార్యాలయం, విజయవాడ వారితో మాట్లాడగా, వారు సానుకూలంగా స్పందించి, సాంకేతిక లోపాలు పరిష్కరించి తిరిగి సదరు కార్యకర్తకు చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగినది. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నమోదు చేసుకున్న కార్యకర్త కుటుంబ పరిస్థితి తెలుసుకున్న శాసనసభ్యులు మానవత దృక్పథంతో స్పందించి, సాంకేతిక కారణాల వల్ల పరిష్కారం కాకపోతే తన సొంత సొమ్మును సభ్యత్వ నమోదు చేసుకున్న కార్యకర్తకు అందిస్తాను అని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం తేది 26.01.2025 అనగా ఆదివారం సదరు కార్యకర్త లక్ష్మి నాయక్ అకౌంట్ నెంబర్ కు ఫోన్ పే ద్వారా 1,00,000/-రూపాయిలు ట్రాన్స్ఫర్ చేయడం జరిగిది. నేను ఒక పార్టీ కార్యకర్తగా ఈ విషయంపై చింతిస్తూ పార్టీకి, కార్యకర్తలకి నేను ఎప్పుడూ రుణపడి ఉంటానని, అలాగే ఆ నిరుపేద కుటుంబానికి ఇటువంటి అవసరానికైనా నేను తోడుగా ఉంటాను అని భరోసా ఇచ్చారు.పార్టీ సభ్యత్వం చేయడంలో నియోజకవర్గ నాయకులు,మరియు కార్యకర్తలు బాగా కష్టపడ్డారు అని అన్నారు.ఈ సందర్భంలో మెలియాపుట్టి మండల నాయకులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవం పట్ల నిర్లక్ష్యం






**గుంతకల్లు టౌన్ ప్రజా జ్యోతి::** మండల పరిధిలో పలు గ్రామాలలో ఆదివారం జరుపుకున్న 76వ గణతంత్ర దినోత్సవం పట్ల అధికారులు, విద్యాసంస్థలు అతి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మండల పరిధిలోని చాలా గ్రామాలలో ఇదే నిర్లక్ష్యం కనిపించింది. వై టీ చెరువు, పాత కొత్తచెరువు, నక్కల దొడ్డి తదితర గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయంలో జెండా కూడా ఎగరవేయలేదు. పాత కొత్త చెరువు గ్రామంలో పిహెచ్ సెంటర్ జెండా ఎగరవేయలేదు. అదే గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో జెండా ఎగరవేసిన అరగంటలోపు జెండాని తీసివేశారు. వై టీ చెరువు గ్రామంలో ఆర్బికే సెంటర్లో జెండా ఎగరవేయలేదు, నక్కల దొడ్డి గ్రామంలో కూడా ఇదే పరిస్థితి. ఉదయం ఎనిమిది గంటలకు పైన ఎగరవేసిన జెండాను సాయంకాలం సూర్యాస్తమయం వరకు ఉంచి జాతీయ గీతం అనంతరం అవరోహణ చేయాల్సి ఉండగా ఏ ఒక్క చోటు కూడా ఈ పద్ధతిని అవలంబించలేదు. దేశానికి గర్వకారణమైన జాతీయ పతాకాన్ని విద్యావంతులైన, ఉపాధ్యాయులు, అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సామాన్యులు ఆ పతకానికి ఇచ్చే గౌరవం ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. భారత రాజ్యాంగం గురించి కొందరు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇచ్చే ఉపన్యాసాలు ఆచరణలో లేవని తేటతెల్లమవుతుంది. నిబంధనలకు విరుద్ధంగా జాతీయ పథకాన్ని అవహేళన చేసేలా ప్రవర్తించిన అధికారులపై చర్యలు తీసుకొని ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉన్నత అధికారులు వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలి. శారద.



**పోడూరు, జనవరి 26,ప్రజాజ్యోతి న్యూస్ :** ప్రతీ భారతీయ పౌరుడూ రాజ్యాంగాన నుసరించి నడుచుకోవాలని యం.పి.టి.సి విప్పర్తి శారద అన్నారు.పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం చింతలగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది.హెచ్.యం కొల్లాబత్తుల సూర్య కుమార్ జాతీయ జెండా ఎగురవేశారు.విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వడ్లపాటి రాజేంద్ర ప్రసాద్,టీచర్ వీరవల్లి బాలాజీ, రిటైర్డ్ టీచర్ జి.రామారావు,యస్ యం సి చైర్మన్ బి.వీరాంజనేయులు,వైస్ సర్పంచ్ కె.లోహిత దాసు,శీలం శ్రీనివాసు, శీలం కుమారస్వామి,తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వాహణలో ఉత్తమ ప్రశంసాపత్రం(అవార్డు) అందుకొన్న పారాపురం సర్వేయర్ అల్లు తిరుపతి రావు








**కొత్తూరు జనవరి26, ప్రజా జ్యోతి న్యూస్** 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా జిల్లా స్థాయిలో కలెక్టర్ వారి ఆదేశాల మేరకు మండలాల వారీగా విధి నిర్వాహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి బెస్ట్ ఎంప్లాయి అవార్డు ప్రతి యేటా ఇవ్వటం ఆనవాయితీగా వస్తుంది.కొత్తూరు మండలం పారాపురం గ్రామ సచివాలయంలో సర్వేయర్ గా విధులు నిర్వహిస్తున్న అల్లు తిరుపతి రావుకు రీ సర్వేలో భాగంగా విధి నిర్వాహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు గానూ కొత్తూరు మండల రెవెన్యూ డిపార్ట్మెంట్లో ఉత్తమ ఎంప్లాయి అవార్డు దక్కింది. ఈ అవార్డు ను కొత్తూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో ఈ రోజు జరిగిన గణతంత్ర వేడుకల్లో భాగంగా తహసీల్దార్ రవిచంద్ర చేతుల మీదగా అల్లు తిరుపతి రావు అందుకున్నారు. ఈయనకు ఈ అవార్డు రావటం పట్ల కొత్తూరు మండల రెవెన్యూ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ అవార్డు అందుకున్న అల్లు తిరుపతి రావు పత్రికా రంగంలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తూ అందరివాడుగా అందరి మన్ననలను అందుకుంటున్న సాక్షి విలేకర్ అల్లు నరసింహ కుమారుడు.

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయొద్దు.

ఎంవిఐ రాజబాబు, రూరల్ ఎస్సై రాఘవేంద్ర




**గుంతకల్లు టౌన్ ప్రజా జ్యోతి: :** ద్విచక్ర వాహనదారులందరూ ఖచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనాలు డ్రైవింగ్ చేయండి. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని గుంతకల్లు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నీలం వెంకట రాజాబాబు, గుంతకల్లు రూరల్ ఎస్సై రాఘవేంద్రప్ప ద్విచక్ర వాహనదారులకు హెచ్చరించారు. ఆదివారం గుంతకల్ రూరల్ పోలీస్ స్టేషన్ దగ్గర జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి వాహనాలకు రికార్డులు సక్రమంగా లేని కారణంగా వాహనాలకు మరియు హెల్మెట్ ధరించని వారికి జరిమానాల విధించారు. ఈ సందర్భంగా వాహనదారులందరికీ రోడ్డు భద్రత గురించి సూచనలు సలహాలు ఇచ్చారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్త తీసుకోవాలని వారికి అవగాహన కల్పించారు. వాహనదారులు ప్రయాణ సమయంలో కచ్చితంగా వాహనాలకు సంబంధించిన రికార్డులు ఇన్సూరెన్స్ పొల్యూషన్ ఆర్ సి డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని తెలియజేశారు. ప్రజలందరూ సురక్షితంగా ఉండాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సూచనలు సలహాలు చేస్తూ ప్రతి సంవత్సరము వారం రోజులపాటు రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తుందని గుర్తు చేశారు. వాహనాలు అతివేగంతో అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడ%శీ% వలన అదుపుతప్పి ప్రమాదాలు జరిగి చనిపోతే, డ్రైవింగ్ చేసిన వారితో పాటు ప్రయాణం చేసే వాళ్ళు కూడా చనిపోవడం వలన వారి కుటుంబ సభ్యులు దిక్కులేని వారిగా జీవించాల్సిన పరిస్థితి వస్తుందని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయం సిబ్బంది, రూరల్ ఏ ఎస్ ఐ శ్రీనివాసులు, పోలీసులు పాల్గొన్నారు.

## వాడ వాడల రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



గుంతకల్లు టౌన్ ప్రజా జ్యోతి : 76వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని వాడవాడలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. తహసిల్దార్ కార్యాలయంలో ఎస్. రమాదేవి, ఎంపీడీవో కార్యాలయంలో ఈ ఓ ఆర్ డి నాగభూషణం, రూరల్ పోలీస్ స్టేషన్లో సీఐ ప్రవీణ్ కుమార్, కసారం ఆలయంలో ఈవో వాణి తమ కార్యాలయంలో మువ్వన్నెల జెండా ఎగరవేసి ప్రజలకు అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగిస్తూ స్వాతంత్రం కోసం ప్రాణాలప్పించిన నాయకులు గురించి, భారత భవిష్యత్తు నిర్మాణం పై హక్కులు, బాధ్యతలు, నియమ నిబంధనలు స్వపరిపాలన వంటి అంశాల గురించి ప్రసంగించారు.

# బొబ్బిలిపేటలో కలకలం





**అనుమానస్పద స్థితిలో వైకాపా నాయకుడు చంద్రియ్య మృతి**

**ఘటనా స్థలానికి చేసుకున్న పోలీసులు**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్న పోలీసులు**

**ఆమదాలవలస, జనవరి 26:** ఆమదాలవలస మండలం బొబ్బిల పేట లో విషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే బొబ్బిల పేట గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు గురుగుబెల్లి చంద్ర శేఖర్ (చంద్రియ్య ) అనుమానస్పద స్థితిలో మృతి చెందారు. చంద్రియ్య వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈయన భార్య గురుగుబెల్లి ఈశ్వరమ్మ, వీరికి ఒక కుమార్తె ,కుమారుడు.కుమార్తె శ్రీకాకుళం ప్రవేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ,కుమారుడు వైజాగ్ ప్రవేట్ స్కూల్ లో ఏడవ తరగతి చదువుతున్నారు. గతంలో వైసిపి తరపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీబరిలో నిలిచి చంద్రియ్య ఓటమి పాలయ్యారు. శనివారం రాత్రి 6 గంటల సమయంలో పదవ తరగతి చదువుతున్న తన కుమార్తెను స్టడీ అవర్స్ అనంతరం ఇంటికి తీసుకురావడానికి అని చంద్రియ్య బయలు దేరాడు. ఎంతకీ తండ్రి రాకపోవడంతో కుమార్తె తల్లికి ఫోన్ చేసి విషయాన్ని తెలియజేసింది. వేరొకరిని పంపించి కుమార్తెను ఇంటికి తీసుకురమ్మని పంపించింది. చాలా సమయం గడుస్తున్నా చంద్రియ్య ఇంటికి రాకపోవడంతో తన భార్య స్థానిక పోలీసు స్టేషన్లో పిర్యాదు చేసింది. దీంతో ఆమదాలవలస సి. ఐ సత్యన్నారాయణ , ఎస్. ఐ బాలరాజు,పొందూరు ఎస్. ఐ సత్యన్నారాయణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చెరువు దగ్గర ఉన్న పోలాలలో చంద్రియ్య ఒంటి మీద గాయాలతో పడి ఉండటాన్ని పోలీసులు గుర్తించి , మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో గణతంత్ర దినోత్సవం రోజు ఇటువంటి సంఘటన వెలుగులోకి రావడంతో గ్రామంలో కలకలం రేపింది. ఒక్కసారిగా గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తన కుమార్తెను తీసుకురావడానికి వెళ్లిన సమయంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు చంద్రియ్య పై దాడికి పాల్పడి హత్య చేశారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. మరణ వార్త తెలిసిన వైకాపా ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయ కర్త చింతాడ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితులపై ఆరా తీశారు. బొబ్బిలి పేట గ్రామంలో ఇటువంటి ఘటన చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి మృతికి గల కారణాలను తెలుసుకోవాలన్నారు. హత్య జరిగినట్లు నిర్ధారణ జరిగితే నిందితులకు కఠిక శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**బాపట్ల జిల్లా ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జనవరి 26 ఆదివారం 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ అధికారులు ఘనంగా నిర్వహించారు అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు పోలీస్ సిబ్బందికి అధికారులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచారు అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ 1947 ఆగష్టు 15 న భారత దేశానికీ స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు దేశ పరిపాలన కొరకు అత్యంత ఆవశ్యకత కలిగిన స్వంత రాజ్యాంగం అమలు చేయాలని నిర్ణయించడం జరిగిందని చెప్పారు దానికి అనుగుణంగా రాజ్యాంగాన్ని తాయారు చెయ్యడానికి రాజ్యాంగ ముసాయిదా కమిటీని ఏర్పాటు చెయ్యడం జరిగిందని తెలిపారు రాజ్యాంగ ముసాయిదా కమిటీ రూపొందించిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చిందని అప్పటి నుంచి దేశం ప్రజాతంత్ర పరిపాలన కలిగిన సంపూర్ణ గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు ఇంతటి ప్రాముఖ్యత కలిగిన రోజు కాబట్టే అప్పటి నుండి మనం ప్రతీ ఏడాది జనవరి 26న గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు రాజ్యాంగాన్ని పరిరక్షించవలసిన బాధ్యత పోలీస్ శాఖ పై ఉందన్నారు రాజ్యాంగబద్ధంగా ప్రతి పోలీస్ తమ విధులు నిష్పక్షపాతంగా నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ తో పాటు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వి శ్రీనివాసరావు ఏ ఆర్ డిఎస్పీ పి విజయసారది ఆర్ ఐ లు శ్రీనివాస రెడ్డి శ్రీకాంత్ ఇతర పోలీసు అధికారులు సిబ్బంది డీపీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు







# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు







**పొందూరు , జనవరి 26 :** పొందూరు మండల కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాలలో,పాఠశాలలో , సచివాలయాలు వద్ద ఆయా ప్రజా ప్రతినిధులు ,అధికారులు తమ దేశభక్తిని చాటుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ మీసాల మన్మథ రావు సమర యోధుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పౌరుడు దేశ సేవకు , దేశ అభివృద్ధికి పాటుపడాలన్నారు. పూర్తి రాజ్యాంగ బద్దంగా పాలన సాగించే రోజును గణతంత్ర దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు. వీటితో పాటు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ బలివాడ వేంకటేశ్వర రావు, ఎమ్మార్సీ కార్యాలయంలో పట్నాన రాజారావు, స్థానిక పోలీస్ స్టేషన్లో ఎ.ఎస్. ఐ రామచంద్రరావు ,వ్యవసాయ పరపతి సంఘం సి.ఈ. ఓ వై పాపినాయుడు ,ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో సూపరిడెంటెంట్ మెట్ట సుజాత , పశు వైద్య శాల లో ఎ.డి పొన్నాడ బాలకృష్ణ,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు పాలిశెట్టి వెంకట్రావు ,తమ తమ కార్యాలయాలలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో భాగంగా మహాత్మా గాంధీ , అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ కిల్లి ఉషారాణి , టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ , ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి , ఏ. ఓ బిబి మిశ్రా , ఈ. ఓ మోహన్ బాబు, ఎపియం గురుగుబెల్లి శ్యామల రావు , సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ సునీల్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ రాజేష్, తహసీల్దార్ కార్యాలయం వద్ద రీ సర్వే డిటి కూన వైకుంఠ రావు , జూనియర్ అసిస్టెంట్ జగదీష్ ,ఆయా కార్యాలయాల సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు

## డాక్టర్ డి సుప్రజకు ఉత్తమ అవార్డు అందజేసిన కలెక్టర్.



**పోడూరు, జనవరి 26 ప్రజాజ్యోతి న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యధికారిణి డి సుప్రజ కలెక్టర్ సిహెచ్ నాగరాణి చేతుల మీదుగా ఆదివారం ఉత్తమ మెడికల్ ఆఫీసర్ గా అవార్డు అందుకున్నారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవార్డు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, అలాగే ఈ అవార్డు నా వృత్తి పట్ల మరింత బాధ్యతను పెంచిందన్నారు. నేను ఇంత ఉన్నత స్థాయికి రావడానికి నన్ను ప్రోత్సహించిన నా తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు ముందుగా కృతజ్ఞతలు తెలుపారు. విధి నిర్వహణలో నాకు సహకరించిన నా తోటి సిబ్బందికి కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. రాబోయే రోజుల్లో మరింత కష్టపడి ప్రజలకు వైద్య సేవలను అందిస్తానని తెలిపారు. డాక్టర్ డి సుప్రజకి అవార్డు రావడం పట్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సిబ్బంది డాక్టర్ పి నరేష్ కుమార్, డాక్టర్ జి మణిత్యాగి, డాక్టర్ ఎస్ వాసవి, ఎం పి హెచ్ ఈ ఓ జె సత్యనారాయణ, సిహెచ్ఓ వై వీరమ్మ, సూపర్వైజర్స్ వై నారాయణమూర్తి, కే. జయమని, సిహెచ్ పద్మ, ఏఎన్ఎం నర్సులు, ఎమ్మెల్ హెచ్ పీ లు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు తదితరులు శుభాకాంక్షలుతెలిపారు.

## బెస్ట్ మెడికల్ ఆఫీసర్ అవార్డు నా బాధ్యత మరింత పెంచింది

**చాపరా పిహెచ్సి వైద్యురాలు డాక్టర్ హేమంత్ లక్ష్మి..**



**మెలియాపుట్టి జనవరి 26, ప్రజా జ్యోతి న్యూస్..** పీహెచ్సీలో ఉన్న సమస్యలకు పరిష్కారం దిశగా తను చేసిన ప్రయత్నాలకు తరచుగా ఫీల్డ్ విజిట్స్ చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూస్తూ మరియు సమర్థవంతంగా సామరస్యంగా సమాజానికి సేవ చేస్తున్నందుకు గణతంత్ర దినోత్సవ సందర్భంగా చాపరా పిహెచ్సి వైద్యురాలు డాక్టర్ హేమంత్ లక్ష్మి ఉత్తమ వైద్యురాలుగా ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు తనకు పీహెచ్సీ పట్ల అలాగే సమాజం పట్ల తనకున్న బాధ్యతను మరింత పెంచిందని ఇంకా ఉత్సాహంగా పనిచేసి మెరుగైన వైద్యం అందేలా చూస్తానని డాక్టర్ హేమంత్ లక్ష్మి అన్నారు.

## భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు..



**పాతపట్నం జనవరి26, ప్రజా జ్యోతి న్యూస్** గణతంత్ర దినోత్సవం జనవరి 26 సందర్భంగా శ్రీకాకుళం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి త్రివర్ణ పతాకానికి గౌరవ వందనం సమర్పించిన బిజెపి నూతన అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజును గణతంత్ర దినోత్సవం గా జరుపుకోవడం భారతదేశ పౌరులుగా మన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు బిజెపి మాజీ అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, బిజెపి సీనియర్ నాయకులు అంటాడా రవి బాబ్జి గారు, మరియు భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు గాను పొందూరు తహసీల్దార్ కు ప్రశంసా పత్రం



**పొందూరు , జనవరి 26:** వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలను అందజేసింది. ఈ మేరకు అంకిత భావంతో విధి నిర్వహణ , విశిష్ట సేవలకు గానూ పొందూరు తహసీల్దార్ వెంకటేష్ రామాంజుల జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా శ్రీకాకుళం లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో అవార్డును అందుకున్నారు. ఈయన ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# హారిక భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.



పోడూరు జనవరి 26 ప్రజాజ్యోతి న్యూస్ : తెలుగు సాహిత్య చరిత్రలో బాలవ్యాకరణావధానం గొప్ప చారిత్రక ఘట్టమని గురు సహస్రావధాని డాక్టర్. కడిమిళ్ల వరప్రసాద్ అన్నారు. 21 వ తేదీన పెనుగొండ యస్. వి కె. పి.శాలలో పదిమంది తెలుగు పండితుల సమక్షంలో డాక్టర్. కడిమిళ్ల పర్యవేక్షణలో పోడూరు మండలం మినిమించిలిపాడు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని చి.ముక్కే హారిక ఈ బాలవ్యాకరణావధాన ప్రక్రియను దిగ్విజయంగా నిర్వహించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అవధానినిగా చి. హారికను తీర్చిదిద్దిన సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లా అన్నపూర్ణేశ్వరరావు ని , ఈ అవధాన కార్యక్రమానికి ఎనలేని ప్రోత్సాహం ఇచ్చిన ఆచార్య రంకిరెడ్డి రామ్మోహన్ రావు ని మినిమించిలిపాడు గ్రామ సర్పంచ్ రామన వీర్రాజు , గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెక్కంటి సత్యనారాయణ ,పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ముక్కే ఏసుబాబు ఘనంగా సత్కరించారు. హారిక భవిష్యత్తు లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఈ అవధానం తెలుగుభాషకు నూతనోత్సాహం తెచ్చిందని ఆచార్య రామ్మోహన్ అన్నారు. హారికకు ఇంటర్ నుండి పీజీ వరకు ఉచిత విద్యను ప్రకటించిన యస్క. వి. కె. పి శాల పాలకవర్గ సెక్రటరీ, కరెస్పాండంట్ డాక్టర్.కలిదిండి రామచంద్రరాజు కి , ప్రిన్సిపాల్ వై.వి. వి.అప్పారావు కి ,పాలకవర్గ అధ్యక్షులు తాడి నాగిరెడ్డి కి ,సంయుక్త కార్యదర్శి పెన్మెత్స వెంకట సుబ్రహ్మణ్య రాజు కి మినిమించిలిపాడు గ్రామ సర్పంచ్ రామన వీర్రాజు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. కరుగోరుమిల్లి విశ్రాంత తెలుగు పండితులు కలగ అచ్యుత రామ లక్ష్మీపతి దీక్షితులు రూ. 5,558/-,పాఠశాల పూర్వ విద్యార్థి ఆరిమిల్లి నర్సింహమూర్తి హారికకు 1116/- ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో మాడభూషి కృష్ణప్రసాద్ గారు, చిర్ల రాజేంద్ర ప్రసాద్ రెడ్డి గారు,గ్రామ జనసేన అధ్యక్షుడు ముక్కే రవిబాబు, మిద్దే రఘు, గ్రామ సెక్రటరీ నాగశ్రీను, కాకాని సత్యనారాయణ,జడ్డు శ్రీనివాస్,పాఠశాల సిబ్బంది,గ్రామస్తులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# కనుల విందుగా పోలీస్ బలగాల కవాతు



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** జనవరి 26న ఆదివారం బాపట్ల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జిల్లా అధికారులు ఘనంగా నిర్వహించారు వేడుకలలో ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అతిధిగా జిల్లా ఎస్పీ తుషార్ దూడి పాల్గొన్నారు జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు ఈ వేడుకులకు బాపట్ల చీరాల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, ఏమ్ మాలకొండయ్య జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ అడిషనల్ ఎస్పీ టి పి విఠలేశ్వర్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు ఆర్ ఐ మౌలుద్దీన్ పెరేడ్ కమాండర్ గా వ్యవహరించి అతిథికి గౌరవ వందనం సమర్పించి కవాతు పరిశీలన కొరకు ఆహ్వానించారు జిల్లా కలెక్టర్ ఎస్.పి లు పరేడ్ కవాతు పరిశీలన వాహనంలో పర్యటించి కవాతులో ఉన్న బలగాలను పరిశీలించి తిరిగి వేదిక వద్దకు చేరుకున్నారు అనంతరం ముఖ్యఅతిధి ఆదేశాలను తీసుకొనిపెరేడ్ కమాండర్ కవాతు బలగాలతో చూపరులను ఆకట్టుకునే విధంగా అద్భుతంగా పరేడ్ మార్చింగ్ నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గణతంత్ర దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను గురించి మాట్లాడారు గత ఏడాది జిల్లాలోని వివిధ శాఖల పనితీరు గురించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు జిల్లా పోలీస్ శాఖ గురించి మాట్లాడుతూ అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ వారి బృందం కృష్ణనది వరదలలో చిక్కుకున్న లంక గ్రామ ప్రజలను రక్షించడానికి 5 రోజుల పాటు వరద ముంపునకు గురైన గ్రామాలలో ఉన్నారని తెలిపారు వారి ప్రాణాలు సైతం లెక్కజేయకుండా ప్రజల ధన మాన ప్రాణాల రక్షణకోసం ఎంతటి కఠిన పరిస్థితులలోనైనా ఎదురొడ్డి నిలబడి విధులు నిర్వహించడం పోలీస్ శాఖ నిబద్ధతకు దర్పణం పడుతుందని పేర్కొన్నారు శాంతి భద్రతల పర్యవేక్షణ లో ప్రజారక్షణ కోసం పటిష్టమైన భద్రతకు జిల్లాలో 862 సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యడం జరిగిందని చెప్పారు సైబర్ నేరాల పై దృష్టి సారించి దేశంలోనే మొట్టమొదటి సారిగా డిజిటల్ అరెస్ట్ తరహా సైబర్ నేరాన్ని జిల్లా పోలీసులు చేదించారని తెలిపారు సంకేతక పరిజ్ఞానాన్ని వినియోగించి రాజస్థాన్ రాష్ట్రంలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్ట్ అరెస్టు చేయటం గొప్ప విషయమని చెప్పారు జిల్లాలో క్రైమ్ రేటు తగ్గించే విధంగా నిరంతరం ప్రణాళిక అమలుచేయడం జరుగుతుందని సూచించారు అనంతరం జిల్లాలోని స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేసిన శకటాలు జిల్లా ప్రగతిని అభివృద్ధిని చాటేయని కలెక్టర్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో పోలీస్ జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది టైగర్ జాగిలం అతిథికి గౌరవ వందనం సమర్పించి బొకే ఇచ్చిన విధానం షాడో జాగిలం వ్యక్తి చెమట వాసన ద్వారా అతడి కర్చీఫ్ కనిపెట్టిన విధానం దొంగతనం చేసి పారిపోయి గ్యాలరీలో ప్రేక్షకుల మద్య కూర్చున్న వ్యక్తిని గుర్తించిన విధానం హర్డిల్ జంప్ ఫైర్ జంప్ విన్యాసాలు బిట్టు జాగిలం పేలుడు పదార్థాలు ఉంచిన బాక్స్ గుర్తించిన విధానం కేసుల చేదనలో జాగిలాల పాత్ర కళ్లకు కట్టినట్లు వివరించాయి చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన సాంస్కృతిక కార్యకలాపాలు ప్రత్యేకంగా అలరింప చేశాయి పోలీస్ డిపార్ట్మెంట్ రెవిన్యూ డిపార్ట్మెంట్ మరియు ఇతర విభాగాల నుండి ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు పోలీస్ శాఖకు చెందిన 67 మంది ప్రశంసా పత్రాలు అందుకున్నారు ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో ఏవో 4 గురు డిఎస్పీ లు 9 మంది సీఐ స్థాయి అధికారులు 7 గురు ఎస్.ఐ స్థాయి అధికారులు, 43 మంది పోలీస్ సిబ్బంది ముగ్గురు డిపిఓ సిబ్బంది ఉన్నారు

# గణతంత్ర దినోత్సవ వేడుకలలో చిన్నారుల నృత్యాలతో కనువిందు



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంలో ప్రజలందరూ స్వేచ్ఛగా జీవించే హక్కు సమన్యాయం లభించాయని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు బాపట్ల జిల్లా పోలీస్ కవాతు మైదానంలో 76వ గణతంత్ర దినోత్సవం ఘనంగా ఆదివారం జరిగింది గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు అనంతరం పుష్పాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేసిన వాహనంపైకి ఎక్కి పోలీస్ కవాతును కలెక్టర్ పరిశీలించారు వేడుకలు జరుగుతున్న మైదాన ప్రాంతంలో పర్యటిస్తూ ప్రజలకు అభివాదం చేశారు పోలీసుల నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు స్వాతంత్ర సమరయోధుల వారసులను శాలువలు పుష్ప మాలలతో ప్రత్యేకంగా సన్మానించారు జిల్లా యంత్రాంగం నిర్వహించిన వేడుకలు అంబరాన్ని అంటాయి ప్రజల కరతాల ధ్వనులతో పోలీస్ కవాతు మైదానం మార్మోగింది సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో అలరించాయి వేడుకలు నిర్వహించిన పోలీస్ కవాతు మైదాన ప్రాంతమంతా జాతీయ జెండాలతో రెపరెపలాడాయి డ్రోన్ ద్వారా జాతీయ పతాకం గగనతలంలో ఆవిష్కరించేలా అధికారులు ఏర్పాటు చేశారు ప్రగతిని చాటుతూ వివిధ శాఖలు రూపొందించిన శకటాల ప్రదర్శన ప్రజలను కనువిందు చేశాయి ప్రజలకు అవగాహన కల్పించేలా శకటాల ముందు వైపు అధికారులు విస్తృతమైన ప్రచారాలతో ప్రదర్శన నిర్వహించారు విద్యాశాఖ శకటానికి కలెక్టర్ ప్రథమ బహుమతి అందించారు వైద్య ఆరోగ్య శాఖ శకటానికి ద్వితీయ బహుమతి అన్న క్యాంటీన్లతో రూపొందించిన మున్సిపాలిటీ శకటం తృతీయ బహుమతిని సొంతం చేసుకుంది సారే జహాసే అచ్చా అంటూ నర్సాయపాలెం అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రదర్శన ప్రథమ బహుమతిని సొంతం చేసుకుంది బేటి పడావో బేటి బచావో అంటూ బాలికల సంరక్షణపై ఏపీ ఆర్ ఎస్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రదర్శన ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది ఎన్ సి సి క్యాడెట్ల ప్రదర్శనతో కలెక్టర్ చేతుల మీదుగా తృతీయ బహుమతి పొందారు జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ప్రభుత్వ అధికారులు ఉద్యోగులను కృష్ణానది వరద విపత్తులో అవిశ్రాంతంగా పనిచేసిన ప్రభుత్వ అధికారులు ఉద్యోగులను జిల్లా కలెక్టర్ వెంకట మురళి ప్రశంసాపత్రాలతో ప్రత్యేకంగా అభినందించారు దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగాలు చేసిన గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ అభివృద్ధి వైపు అడుగులు వేయాలని కలెక్టర్ చెప్పారు సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలని తెలిపారు స్వేచ్ఛ సమానత్వం లౌకికత్వం సమన్యాయం ప్రతి ఒక్కరికి అందాలని రాజ్యాంగం హక్కు కల్పించిందని పేర్కొన్నారు స్వాతంత్ర్యం కొరకు ప్రాణాలర్పించిన వారిని స్ఫూర్తిగా తీసుకుని జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ చెప్పారు పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆర్థికంగా వెనుకబడిన వారి అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు జిల్లా అభివృద్ధి కొరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కార్యక్రమాలను వివరించారు బాపట్ల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి బాటలో పయనిస్తుందని చెప్పారు అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు ఆయా రంగాల ప్రతినిధులు భాగస్వాములవుతున్నారని అభినందించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుషార్ దూడి జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ అదనపు ఎస్పి విఠలేశ్వర్ బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్ జిల్లా అధికారులు ఉద్యోగులు ప్రముఖులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ఉత్తమ సేవలకు గాను పొందూరు తహసీల్దార్ కు ప్రశంసా పత్రం



**పొందూరు , జనవరి 26:** వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలను అందజేసింది. ఈ మేరకు అంకిత భావంతో విధి నిర్వహణ , విశిష్ట సేవలకు గానూ పొందూరు తహసీల్దార్ వెంకటేష్ రామాంజుల జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా శ్రీకాకుళం లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో అవార్డును అందుకున్నారు. ఈయన ఎంపిక పట్ల డిప్యూటీ తహశీల్దార్ బలివాడ వేంకటేశ్వర రావు , రీ సర్వే డిటి కూన వైకుంఠ రావు , ఆర్. ఐ,జూనియర్ అసిస్టెంట్ జగదీష్ ,మండల వి.ఆర్వో లు,రెవెన్యూ సిబ్బంది పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో గణతంత్ర దినోత్సవం జెండా ఆవిష్కరణ చేసిన గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం.





**గుంతకల్లు టౌన్ ప్రజా జ్యోతి :** 76వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి ఆధ్వర్యం లో మువ్వన్నెల జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వతంత్రం కోసం ప్రాణాలర్పించిన నాయకులు గురించి భారత భవిష్యత్తు నిర్మాణంపై హక్కులు బాధ్యతలు నియమ నిబంధనలు స్వపరిపాలన అంశాల గురించి మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో గుంతకల్ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, తలారి మస్తానప్ప సప్లయర్ హనుమంతు మస్తాన్ యాదవ్, ఎంపీటీసీలు, సర్పంచులు విద్యార్థులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత అందరిది

**- జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పేడాడ రామ్మోహన్**



**ఆమదాలవలస , జనవరి 26:** భారత రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని జనసేన పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ ఇంచార్జి పేడాడ రామ్మోహన్ అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆముదాలవలస జనసేన పార్టీ కార్యాలయం వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలు గుణమగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేడాడ రామ్మోహన్ రావు స్థానిక పార్టీ నాయకులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడంతోపాటు భారత రాజ్యాంగం మనందరికీ అందించిన ప్రాథమిక హక్కులను గుర్తించుకోవాలన్నారు. భారత రాజ్యాంగం నిర్దేశించిన విధులను కూడా ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందని, అప్పుడే మన దేశం అని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలిచి ప్రపంచంలోనే ఒక అగ్రరాజ్యంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ ఉత్సవంలో పాల్గొన్న జోగి రాజా - లోవ రాజు



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం బవురువాక గ్రామం లో ప్రభుత్వ పాఠశాలలో జరిగిన 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు సచివాలయం అధికారులు గ్రామ పెద్దలు బీజేపీ ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు కించు జోగిరాజు బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు నందా లోవరాజు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రైవేట్ కొలువు కోసం డీప్

**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాల భర్తీ వేగం పుంజుకుంది. తాము ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఏడాదిలో 55 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ సమస్య పరిష్కారాన్ని వేగవంతం చేయాలని రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రైవేటు కొలువులపై దృష్టిపెట్టారు. ప్రభుత్వం మధ్యవర్తిత్వంలో ప్రైవేటు సంస్థల్లోనూ అర్హులకు ఉద్యోగాలు ఇచ్చేలా డీఈఈటీ(డీట్) యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ యాప్ ఏఐ ఆధారంగా పనిచేస్తుంది. పరిశ్రమలకు, నిరుద్యోగులకు వారధిగా పనిచేస్తుంది. నిరుద్యోగులకు ఉన్న నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు ఈ డిజిటల్ ప్లాట్‌పాం కల్పిస్తుంది. రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చడమే లక్ష్యంగా దీనిని ప్రభుత్వం రూపొందించింది. దీంతో రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ప్రైవేటు సంస్థలో నిరంతరం ఉద్యోగాల కల్పనకు ఈ డీట్ యాప్ పనిచేస్తుందిఈ యాప్‌లో ఉద్యోగ సమాచారంతోపాటు స్కిల్ ప్రోగ్రామ్‌లతోపాటు అన్నీ ఒకేచోట లభించేలా డిజిటల్ ప్లాట్‌ఫాం అందుబాటులోకి తెచ్చారు. ప్రత్యేక యాప్‌ను రూపొందించిన ప్రభుత్వం వివిధ కంపెనీలు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను అలాగే అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్ తదితర వివరాలను ఈ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అందుబాటులోకి తెస్తుంది. వివిధ అవసరాలకు తగినట్లుగా కంపెనీలు రిక్రూట్‌మెంట్ చేసుకుంటాయి.నిరుద్యోగులతోపాటు పైనల్ ఇయర్‌లో ఉన్న విద్యార్థులు తమ పూర్తి వివరాలను ఇందులో నమోదు చేసుకోవడం ద్వారా సులభంగా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుంది. వివరాలు నమోదుచేసుకున్న అభ్యర్థులకు కంపెనీలు తమ అవరసాలకు తగిన ఉపాధి అవకాశాలకు సంబంధించిన మెస్సేజ్‌లు, మెయిల్స్ పంపించడంతోపాటు కాల్స్ కూడా చేసి ఇంటర్వ్యూలునిర్వహిస్తాయి. ఈ యాప్ ద్వారా ఉద్యోగాలు కోరుకునేవారికి మాత్రమే కాకుండా ఉద్యోగాలు ఇచ్చేవారికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. మెరుగైన స్కిల్స్ ఉన్నవారిని ఎంపిక చేసుకోవడానికి కంపెనీలకు వెసులుబాటు కలిగింది.డీట్ యాప్ ప్రస్తుతం ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది డీఈఈటీ పేరిట ఉంటుంది. దీనిని డౌన్‌లోడ్ చేసుకుని ఉద్యోగం కోసం సైన్ఇన్ అవ్వాల్సి ఉంటుంది. అందులో వారు అడిగిన ప్రొఫైల్ డేటాను పూర్తిచేసి దరఖాస్తులను సమర్పించాలి. యాప్‌లో లాగిన్ అయిన తర్వాత మీరు ఎలాంటి ఉద్యోగాలు చేయాలనుకుంటున్నారో చూడాలి.వీటితోపాటే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు కూడా ఈ యాప్‌లో ఉంటాయి.

## ఉత్తమ ప్రతిభ పురస్కారాలు అందుకున్న బాపట్ల మున్సిపాలిటీ సిబ్బంది



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన బాపట్ల పురపాలక సంఘ సిబ్బంది అయిన మునిసిపల్ ఇంజనీర్ కృష్ణా రెడ్డికి, శానిటరీ ఇన్స్పెక్టర్ సి. హెచ్.కరుణ కి అసిస్టెంట్ యమ్.ఉదయ గోపికి ఆఫీస్ సబార్డినేట్ బి.ప్రసాద రావుకి బాపట్ల జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ జె వెంకట మురళి చేతుల మీదుగా సర్టిఫికెట్ లు అందజేశారు ప్రశంస పత్రాలు అందుకున్న సిబ్బందిని మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి అభినందించారు

## చంద్రియ్య హత్య బాధాకరం

**బాధిత కుటుంబానికి న్యాయం జరగాలి**

**హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి**

**వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు**



**ఆమదాలవలస ,జనవరి 26:ల** ఆమదాలవలస మండలం బొబ్బిలి పేట గ్రామానికి చెందిన జి చంద్రయ్య హత్యకు గురికావడం భాధాకరమని వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు అన్నారు. చంద్రియ్య మరణం పార్టీకి తీరని లోటని ,బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైకాపా పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. ఇలాంటి హత్యలకు పాల్పడటం హేయమైన ,క్రూరమైన చర్య అని , ఇలాంటి దారుణాలు నియోజకవర్గంలో కానీ ,జిల్లా లో కానీ పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి చంద్రియ్య పై హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్యకు గల కారణాలను వెలికి తీయాలని కోరారు. నిందితులు ఎంతటి వారైనా రాజకీయ పలుకుబడితో వున్నవారైనా వదిలిపెట్టవద్దు అని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని తెలిపారు.

## స్వతంత్రం కోసం ప్రాణాలర్పించిన నాయకుల అడుగుజాడల్లో విద్యార్థులు నడవాలి.

### జిల్లా డాక్టర్ సెల్ పత్తి హిమబిందు





**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** ఈరోజు గుంతకల్ పట్టణంలలో ప్రతిభ వికాస్ స్కూల్లో 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జరిగాయి ఈ సందర్భంగా అనంతపురం జిల్లా డాక్టర్ సెల్ పత్తి హిమబిందు , మువ్వన్నెల జెండా ఎగరవేసి ఉపాధ్యాయులకు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ఆమె మాట్లాడుతూ స్వతంత్రం కోసం ప్రాణాలు అర్పించిన నాయకుల గురించి భవిష్యత్తు నిర్మాణం పై హక్కులు నిబంధనలో పరిపాలన వంటి అంశాలను తెలియజేశారు ఈ కార్యక్రమంలో,స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ జి ఎన్ వెంకటేష్ ,సెక్రెటరీ రామన్, అన్నపూర్ణ మరియు స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పిల్లలు పాల్గొన్నారు.

# త్వరలో తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు



**హైదరాబాద్ :** త్వరలో తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికపై.. అధికార కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఇక్కడి నుంచి ప్రస్తుతం కాంగ్రెస్ సీనియర్ నేత టి.జీవన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అటు బీజేపీ ఈ సీటుపై కన్నేసింది. కానీ బీఆర్ఎస్ మాత్రం మౌనంగా ఉంది. పార్టీ నుంచి, కేసీఆర్ నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో నేతలు అయోమయంలో ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. ఆ తర్వాత 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు రాలేదు. మూడో స్థానానికి పడిపోయింది. ఆ తర్వాత వరంగల్- నల్గొండ- ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరిగింది. దాంట్లోనూ బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి ఓడిపోయారు. ఈ నేపథ్యంలో.. కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ ఎమ్మెల్సీ ఎన్నిక తెరపైకి వచ్చింది. దీనిపైనా కేసీఆర్ ఎటూ తేల్చడం లేదు. పోటీ చేయబోతున్నామని గానీ.. చేయడం లేదని గానీ చెప్పడం లేదుఅటు బీజేపీ, కాంగ్రెస్ మాత్రం గ్రౌండ్ వర్క్ చేస్తున్నాయి. ఒక్క బీఆర్ఎస్ పార్టీనే క్షేత్రస్థాయిలో వర్క్ చేయడం లేదనే టాక్ ఉంది. ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్ ఆసక్తి చూపిస్తున్నారు. కానీ.. అధినేత నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో.. సైలెంట్‌గా ఉంటున్నారు. బీజేపీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు క్యూకడుతున్నారు. ఈ నేపథ్యంలో అసలు కేసీఆర్ ఎందుకు మౌనంగా ఉంటున్నారనే చర్చ పార్టీలో జరుగుతోంది.అయితే.. ఈ ఎన్నికల ప్రభావం త్వరలో జరగబోయే స్థానిక సంస్థలపై ఎన్నికలపై పడుతుందనే చర్చ బీఆర్ఎస్‌లో జరుగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒకవేళ ఓడిపోతే.. పంచాయతీ ఎన్నికలపై ప్రభావం చూపి.. ఆశించిన ఫలితాలు రావని గులాబీ బాస్ ఆలోచిస్తున్నట్టు నేతలు చెబుతున్నారు. కానీ.. అసలు పోటీ చేయకపోతే అస్త్ర సన్యాసం చేసినట్టు అవుతుందని కేసీఆర్ వద్ద కొందరు నేతలు అన్నట్టు తెలిసింది.ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకపోతే క్యాడర్‌కు తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉందని.. బీఆర్ఎస్ సీనియర్ నేత ఒకరు చెప్పారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు చేజారిపోతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గెలిచినా పార్టీలో ఉంటారనే గ్యారంటీ లేదు. అభివృద్ధి కోసమంటూ అధికార పార్టీలో చాలామంది చేరతారు. ఇవన్నీ తెలిసినా కేసీఆర్ ఈ ఎన్నికపై ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థం కావడం లేదని కారు పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.ఇప్పటికిప్పుడు ఎన్నికలు వచ్చినా 100 ఎమ్మెల్యే సీట్లు గెలుస్తామని కేటీఆర్ గట్టిగా చెప్పారు. కానీ ఈ ఎన్నికపై ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్, బీజేపీ ప్రశ్నిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తే.. బీఆర్ఎస్ పట్టు ప్రజల్లో ఎలా ఉందో తెలుస్తుంది. పోటీ చేయకపోతే బీఆర్ఎస్ భయపడిందని రాజకీయ ప్రత్యర్థులు ప్రచారం చేస్తారు. అప్పుడు క్యాడర్‌లో నమ్మకం సన్నగిల్లుతుంది. ఇది పార్టీకి మరింత ప్రమాదం.ఫలితాలు ఎలా వచ్చినా పర్లేదు.. పోటీ చేయాలని మెజార్టీ నేతలు కేసీఆర్ వద్ద అన్నట్టు తెలిసింది. ఫలితాలు ఆశించిన స్థాయిలో వస్తే.. శ్రేణుల్లో ఊపు వస్తుంది. మరింత గట్టి ఫైట్ చేయొచ్చు అనే అభిప్రాయాలు వ్యక్తం చేసినట్టు సమాచారం. ఒకవేళ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోతే.. లోపం ఎక్కడుందో సరిచేసుకునే అవకాశం ఉంటుందని నేతలు అన్నట్టు తెలిసింది. అయినా కేసీఆర్ మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. చూడాలి మరి గులాబీ దళపతి ఏ నిర్ణయం తీసుకుంటారో.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం వేడుకలు



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణంలో 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు జాతీయ పతాకాన్ని ఎగరవేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగం మనకు అందించిన మౌలిక హక్కులను కాపాడుకుంటు దేశాభివృద్ధికి కృషి చేద్దామని తెలిపారు ప్రపంచంలోనే పటిష్టమైన రాజ్యాంగం కలిగిన దేశం భారతదేశం అని కొనియాడారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఉత్తమ సేవా పత్రాలు అందుకున్న సమాచార శాఖ ఉద్యోగులు



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల జిల్లా పౌరసంబంధాల సమాచార శాఖ లో విధులు నిర్వహిస్తున్న పి ఆర్ ఓ కనుమూరి కిరణ్ కుమార్, వీడియో గ్రాఫర్ చేవూరి. రవి కిరణ్ , ఫోటో గ్రాఫర్ అత్తంటి సతీష్ చంద్ గత ఎన్నికలు మరియు వరదల సమయంలో ఉత్తమ సేవకు గాను 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చేతుల మీదగా ప్రశంస పత్రాలు అందుకున్నారు ఈ సందర్భంగా మీడియా వారిని అడిగినప్పుడు విధి నిర్వహణ అంకితభావంతో పని చేయగలిగిన నాడు ఇలాంటి ప్రోత్సాహం అందుకోవటం జరుగుతుందని ప్రశంసా పత్రాలు అందుకున్న వారు సంతోషం వ్యక్తం చేశారు

# దానం స్వరం మారుస్తున్నారా...




**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ లో ఎమ్మెల్యే దానం తీరు చర్చనీయాంశంగా మారింది. నేతలంతా ఓ దారిలో ఉంటే? దానం రూట్ మాత్రం సెపరేట్ అన్నట్లుగా ఉంది. ప్రధానంగా కూల్చివేతల విషయాన్ని వ్యతిరేకిస్తున్నారు. బతుకొచ్చిన వాళ్లపై దౌర్జన్యం చేస్తారా..? అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.'దానం నాగేందర్'? గ్రేటర్ హైదరాబాద్ లోని ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఆయన? కొద్దిరోజులకే కాంగ్రెస్ లో చేరారు. అంతేకాదు? పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి హస్తం పార్టీ అభ్యర్థిగా కూడా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉండగా?. కొద్దిరోజులుగా ఆయనవ్యవహరిస్తున్న తీరు గ్రేటర్ కాంగ్రెస్ లో చర్చనీయాంశంగా మారింది.దానం నాగేందర్ రాజకీయ ప్రస్థానం కూడా కాంగ్రెస్ పార్టీతో ముడిపడి ఉంది. గతంలో ఆ పార్టీ తరపున పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన? మంత్రిగా కూడా పని చేశారు. 2009లో ఎమ్మెల్యేగా గెలిచి కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్ లో మంత్రి అయ్యారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని వీడిన దానం నాగేందర్?.. బీఆర్ఎస్ పార్టీలో చేరారుబీఆర్ఎస్ పార్టీలో చేరిన దానం నాగేందర్ 2018 ఎన్నికల్లో టికెట్ దక్కించుకున్నారు. బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిపై 28,402 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఆ తర్వాత పార్టీలో కీలకంగా మారారు. అంతేకాకుండా? 2023 డిసెంబర్ లో జరిగిన ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తరపున విక్టరీ కొట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డిపై 22,010 ఓట్ల తేడాతో నెగ్గారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా? బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయింది.అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ కు కు తెరలేపింది. దీంతో ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్? కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కండువా కప్పుకున్నారు. అంతేకాకుండా? ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో దానం నాగేందర్ ఓడిపోయారు.బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరిన దానం నాగేందర్? కారు పార్టీ నేతలపై తీవ్రస్థాయిలో ఫైర్ అవుతూ వచ్చారు. అసలు ఆ పార్టీలో కనీసం గౌరవం ఉండదంటూ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఇక అసెంబ్లీ వేదికగా? బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పరుషపదజాలం ఉపయోగించి వార్నింగ్ కూడా ఇచ్చారు. అప్పట్లో ఆయన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి.గత కొద్దిరోజులుగా దానం నాగేందర్ తీరు గ్రేటర్ కాంగ్రెస్ లో హాట్ టాపిక్ గా మారింది. దీనికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత? హైదరాబాద్ లోని చెరువులు, నాలాలను రక్షించటమే ధ్యేయంగా హైడ్రా వ్యవస్థను తీసుకువచ్చింది. సీఎం రేవంత్ ఆలోచనలతో ఏర్పాటైన హైడ్రాను? ప్రభుత్వంలోని కీలక నేతలంతా స్వాగతిస్తూ వచ్చారు. అయితే ఈ విషయంలో ఎమ్మెల్యే దానం తీరు సెపరేట్ గా ఉందనే చెప్పొచ్చు. ఆయన నియోజకవర్గ పరిధిలో జరిగిన హైడ్రా కూల్చివేతలను దానం తీవ్రంగా ఖండించారు. ఇలాంటి పనులతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందంటూ కూడా హితవు పలికే ప్రయత్నం చేశారుతాజాగా చింతల్ బస్తీలో జీహెచ్ఎంసీ, పోలీసు, ట్రాఫిక్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఫుట్ పాత్?లు ఆక్రమణలను తొలగించారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే దానం? అక్కడికి చేరుకున్నారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. తన పర్మిషన్ లేకుండా ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. నిబంధనల మేరకే కూల్చివేతలు చేస్తున్నట్లు అయితే? ముందుగా ఓల్డ్ సిటీ నుంచి ప్రారంభించాలంటూ హితవు పలికారు. అక్కడ కూల్చివేతలు చేసిన తర్వాత? తన నియోజకవర్గానికి రావాలంటూ కామెంట్స్ చేశారు.తాను హైదరాబాద్ వాడినే ఇక్కడ అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోనంటూ దానం నాగేందర్ వార్నింగ్ ఇచ్చారు. కూల్చివేతల విషయంపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చిస్తానని? అప్పటివరకు ఆపాలని కోరారు.నిజానికి నగరంలో హైడ్రాతో పాటు జీహెచ్ఎంసీ కూల్చివేతల విషయంలో దానం నాగేందర్ చాలా సీరియస్ గా స్పందిస్తున్నారు. అధికారులను తీవ్రస్థాయిలో మందలిస్తు న్నారు. కూల్చివేతల నిర్ణయం సరికాదని? ఇలాంటి వాటితో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనే అభిప్రాయాన్ని బలంగా వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల కిందట ఆయన ఓ యూట్యూబ్ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫార్ములా ఈరేస్ కేసుపై స్పందించారు. ఫార్ములా ఈరేస్ తో హైదరాబాద్ ఇమేజ్ పెరిగిందని చెప్పుకొచ్చారు. కేటీఆర్ అరెస్ట్ అంశంపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కామెంట్స్ కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఫార్ములా ఈరేస్ కేసులో విచారణ జరుగుతున్న సమయంలో? ఎమ్మెల్యే దానం చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారా యనే చర్చ కూడా వినిపించింది.మొత్తంగా అధికారపక్షంలో ఉన్న దానం నాగేందర్ తీరుపై ఆ పార్టీ నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన చేస్తున్న వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఉన్నాయనే చెబుతున్నారు. ఎమ్మెల్యే దానం తీరు స్వపక్షంలో విపక్షంలా ఉందనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి?!

# తేనె వల్ల జుట్టు తెల్లబడుతుందా?

జుట్టు రంగు మెలనిన్ పిగ్మెంట్ వల్ల వస్తుంది. ఇది జుట్టు వేర్లలోని మెలనోసైట్స్ ద్వారా ఉత్పత్తి అవుతుంది. తేనెలో గ్లూకోజ్ ఆక్సిడేజ్ అనే పదార్థం ఉంది. ఇది తక్కువ స్థాయిలో హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను ఉత్పత్తి చేస్తుంది. కానీ ఇది జుట్టు రంగు మార్చడానికి సరిపోదు. మనలో కొంతమంది తేనే తలపై పడితే జుట్టు తెల్లబడుతుందని నమ్ముతుంటారు. జుట్టు తెల్లబడటానికి గల అసలు కారణాలను, తేనెకు సంబంధించి ఉన్న తప్పుడు నమ్మకాలపై వైద్య నిపుణులు ఎం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. మన జుట్టు వేర్ల వద్ద ఉండే హేర్ ఫాలికల్స్ లో మెలనోసైట్స్ అనే కణాలు ఉంటాయి. ఈ మెలనోసైట్స్ మెలనిన్ పిగ్మెంట్‌ను ఉత్పత్తి చేస్తాయి. దీని వల్లే జుట్టుకు నల్లటి రంగు వస్తుంది. కొన్ని సందర్భాల్లో జన్యు మార్పులు లేదా వయసు ప్రభావం వల్ల మెలనిన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. ఈ పరిస్థితిలో జుట్టు రంగు క్రమంగా తెల్లబడుతుంది. ఇది సహజమైన ప్రక్రియ కాగా.. తేనె వల్ల జుట్టు తెల్లబడడం అనేది శాస్త్రీయంగా అవాస్తవమని నిపుణులు తెలిపారు. తేనెలో గ్లూకోజ్ ఆక్సిడేజ్ అనే పదార్థం చాలా తక్కువ మోతాదులో ఉంటుంది. ఇది నీటితో లేదా తేమతో కలిసినప్పుడు హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్ పెరాక్సైడ్ రంగు మార్చే లక్షణాలు కలిగి ఉన్నప్పటికీ, తేనెలో ఇది చాలా తక్కువ స్థాయిలో మాత్రమే ఉంటుంది. ముఖ్యంగా తేనె నుంచి వచ్చిన హైడ్రోజన్ పెరాక్సైడ్ జుట్టు రంగును మార్చలేని స్థాయిలో ఉండటం వల్ల, తేనె వల్ల జుట్టు తెల్లబడటం అనేది అసంభవమట. తేనే వల్ల జుట్టు తెల్లబడుతుందని చెప్పడం ఒక అపోహ మాత్రమే. తేనెను తలకు రాయడం వల్ల హానికరమైన ప్రభావాలు ఉండవు. తేనెలో ఉన్న పోషకాలు తల చర్మానికి మేలు చేస్తాయని మాత్రమే శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అంతేకాకుండా తేనెను నేరుగా తలకు రాసినప్పటికీ.. ఇది జుట్టు రంగును మార్చే శక్తిని కలిగి ఉండదు. తేనెకు సంబంధించిన శాస్త్రీయ పరిశీలనల్లో కూడా ఇలాంటి ప్రభావాలపై ఎలాంటి ఆధారాలు లేవని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. తేనే వల్ల జుట్టు తెల్లబడుతుందని నమ్మి దీన్ని దూరంగా పెట్టడం సరైనది కాదు. తేనె ప్రకృతి సమృద్ధి కలిగిన అద్భుతమైన పదార్థం. ఇది ఆరోగ్యానికి, చర్మానికి ప్రయోజనకరమైన గుణాలు కలిగి ఉంది. రసాయన పదార్థాలు కలిగిన రంగులతో పోల్చితే తేనెలో ఉండే హైడ్రోజన్ పెరాక్సైడ్ చాలా తక్కువ మోతాదులో ఉంటుంది. కాబట్టి తేనెను ఉపయోగించడం వల్ల జుట్టు తెల్లబడుతుందని అనుకోవడం శాస్త్రీయంగా అవాస్తవం.






## అంతరిక్షం నుంచి మహాకుంభ మేళా.. కళకళలాడుతున్న ప్రయాగ్‌రాజ్..

ఉత్తరప్రదేశ్‌లో జరిగే మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. దీంతో ప్రయాగ్‌రాజ్ కళకళలాడుతుంది. 45 రోజుల పాటు జరిగే కుంభమేళాలో దాదాపు 40 కోట్ల మంది పాల్గొంటారని అధికారుల అంచనా. ఇందు కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భారీ ఎత్తున్న ఏర్పాట్లు చేసింది. టెంట్ సిటీని నిర్మించి భక్తులకు వసతి సదుపాయం కల్పించింది. సాధువుల నుంచి సామాన్యుల దాకా టెంట్లలో ఉంటున్నారు. అయితే ఇందుకు సంబంధించి కొన్ని చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో తాజాగా విడుదల చేసింది. స్పేస్ సెంటర్ నుంచి కుంభమేళా ఏరియాను ఉపగ్రహాలు తీసిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు ఇస్రో చేసింది. ఇందులో భారతదేశ పటం కనిపించడం విశేషం. మహాకుంభ మేళాకు సంబంధించిన ఏర్పాట్లు చేయకముందు, చేసిన తర్వాత తీసిన ఫొటోలను ఇస్రో షేర్ చేసింది. గతేడాది ఏప్రిల్ లో ఈ ఏరియా నిర్మానుష్యంగా, బీడు భూములను తలపించేలా కనిపించింది. డిసెంబర్ 22న తీసిన ఫొటోలలో ఈ ప్రాంతంలో నిర్మాణాలు ప్రత్యక్షమయ్యాయి. టెంట్ల నిర్మాణం గత డిసెంబర్ లోనే మొదలైంది. తాత్కాలికంగా శివాలయ పార్కును కూడా అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో భారతదేశ పటం కనిపించడం విశేషం. ఈ నెల 10న తీసిన ఫొటోలలో మహాకుంభ్ నగర్ లో నిర్మాణాలు భారీగా పెరిగిపోవడం చూడొచ్చు. కాగా, మహా కుంభమేళా సంక్రాంతి రోజున ప్రారంభమైంది. ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ఈ మహా కుంభమేళా ముగుస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. ఇక మహా కుంభమేళాలలో హెల్త్‌కేర్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వంద బెడ్లతో సెంట్రల్ ఆస్పత్రిని సెటప్ చేశారు. రెండు 20 పడకల సబ్ సెంటర్ ఆస్పత్రులను, 25 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక కుంభమేళా ప్రాంతంలో 125 అంబులెన్సులు అందుబాటో ఉంటాయి. సుమారు లక్షా 60 వేల టెంట్లను ఏర్పాటు చేశారు. లక్షా 50 వేల టెయిలెట్లను నిర్మించారు. దాదాపు 15వేల మంది శానిటేషన్ వర్కర్లు పనిచేయనున్నారు. 1250 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ వేశారు. 67 వేల ఎల్ఈడీ లైట్లు, రెండు వేల సోలార్ లైట్లు, మూడు లక్షల వృక్షాలను ఏర్పాటు చేశారు.

# రిపబ్లిక్ డేకి మూడు రంగులతో ఇలా కలర్‌ఫుల్ వంటలు చేయండి

ఆగష్టు 15, రిపబ్లిక్ డే రోజున చాలా మంది మూడు రంగులతో కూడిన డ్రెస్సింగ్ ధరిస్తూ ఉంటారు. ఇది చూపరులను కూడా ఆకట్టుకుంటుంది. మరికొంత మంది అనేక రెసిపీలు తయారు చేసి సోషల్ మీడియా వేదికగా పంచుకుంటారు. ఈసారి మీరు కూడా తయారు చేసి మీ పిల్లలకు సర్‌ప్రైజ్ చేయండి. గణతంత్ర దినోత్సవం దగ్గర పడింది. ప్రతీ ఏటా జనవరి 26వ తేదీన రిపబ్లిక్ డేని ఎంతో ఘణంగా సెలబ్రేట్ చేస్తుంది ప్రభుత్వం. త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసి శుభాకాంక్షలు చెబుతారు. దేశ వ్యాప్తంగా కూడా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతాయి. చాలా వరకు ఆగష్టు 15, రిపబ్లిక్ డే రోజున చాలా మంది మూడు రంగులతో కూడిన డ్రెస్సింగ్ ధరిస్తూ ఉంటారు. ఇది చూపరులను కూడా ఆకట్టుకుంటుంది. మరికొంత మంది అనేక రెసిపీలు తయారు చేసి సోషల్ మీడియా వేదికగా పంచుకుంటారు. ఈసారి మీరు కూడా తయారు చేసి మీ పిల్లలకు సర్‌ప్రైజ్ చేయండి. మూడు రంగులతో ఎంతో కలర్ ఫుల్‌గా కనిపస్తాయి. ఇంట్లో ఉండే వాటితోనే ఈజీగా తయారు చేసుకోవచ్చు. ఏం చేయాలా అని కొంత మందికి తోచదు. అలాంటి వారికి ఈ టిప్స్ హెల్ప్ చేస్తాయి.



ఇడ్లీ: ఎంతో ఈజీగా మూడు రంగులతో కలిపి ఇడ్లీలు తయారు చేసుకోవచ్చు. తెలుపు రంగుకు సాధారణంగా వాడే ఇడ్లీ పిండి వాడవచ్చు. గ్రీన్ కలర్ కావాలంటే.. పాలకూర పేస్ట్ లేదా పచ్చి మిర్చి పేస్ట్ వాడవచ్చు. ఇక ఆరెంజ్ కలర్ కోసం.. క్యారెట్ తురుము లేదా రసాన్ని ఉపయోగించవచ్చు. ఈ మూడు రంగులతో కలిపి ఇడ్లీ తయారు చేస్తే చూడటానికి కూడా ఎంతో కలర్ ఫుల్‌గా ఉంటుంది. దోశలు:దోశలను కూడా మూడు రంగులతో ఎంతో రుచిగా, ఆకర్షణీయంగా చేసుకోవచ్చు. పైన చెప్పినట్టే దోశల బ్యాటర్‌లో కూడా పాలకూర పేస్ట్, క్యారెట్ మిశ్రమాన్ని ఉపయోగించి మూడు రంగులతో దోశలు తయారు చేయవచ్చు. సాండ్ విచ్:సాండ్ విచ్‌ని కూడా మూడు రంగులతో ఇంట్రెస్టింగ్‌గా తయారు చేసుకోవచ్చు. ఇవి రుచిగానే కాకుండా చూడటానికి కూడా ఎంతో టెంప్టీగా ఉంటాయి. రైస్ ఐటెమ్స్:రైస్‌తో ఎన్నో రకాల వంటలు తయారు చేస్తూ ఉంటాం. ఇలానే మూడు రంగుల కాంబినేషన్‌తో రైస్ ఐటెమ్స్ కూడా తయారు చేసుకోవచ్చు. పాలకూర రైస్, క్యారెట్ రైస్, వైట్ రైస్‌గా చేయవచ్చు. స్వీట్స్: స్వీట్స్‌ని కూడా ఇదే మూడు రంగులతో ఎంతో ఆకర్షణీయంగా, నేచురల్ పదార్థాలను ఉపయోగించి తయారు చేయవచ్చు. ఇలా ఒకటి కాదు.. రెండు.. కాదు మనసు పెడితే మీలో కొత్త కలను బయటకు తీయవచ్చు.

## రైస్ పాడవకుండా ఎలా ఉంచాలి?




ఉదయాన్నే వండిన బియ్యం రాత్రి వరకు పాడవకుండా ఉంచుకోవడానికి కొన్ని చిట్కాలు పాటించాలి. ఈ చిన్న చిట్కాలు పాటించడం ద్వారా బియ్యం రుచితో పాటు తేమను కోల్పోకుండా ఉంచటానికి చాలా ఉపయోగ పడుతుంది. పెద్ద వేడుకలు లేదా రోజువారీ వంటకు ఈ చిట్కాలతో అవసరం ఉంటుంది. ఉదయాన్నే వండిన రైస్ పాడవకుండా తాజాగా ఉంచుకోవడానికి మీరు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ఇది పండగలు, పెళ్లిళ్లు, ఇతర వేడుకల సమయంలో ఉపయోగపడుతుంది. ఈ పద్ధతిని అనుసరించడం ద్వారా రైస్ రుచిగా ఉండడమే కాకుండా.. ఎక్కువసేపు పాడవకుండా ఉంటుంది. రూమ్ లలో అధిక వేడి కారణంగా మనం వండే రైస్ చాలా త్వరగా పాడవుతుంది. ఉదయం వండిన రైస్ ని మధ్యాహ్నం లేదా రాత్రికి ఉపయోగించే సమయంలో అప్పటికప్పుడే తినలేని పరిస్థితి ఉంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది ముఖ్యంగా చాలా సమయం ముందే వండిన రైస్ కి అనుకూలంగా ఉంటుంది. రైస్ సరిగ్గా ఉడికించడానికి బియ్యం పూర్తిగా మృదువుగా ఉడికిన సమయంలో ఒక టీస్పూన్ కొబ్బరి నూనెను అందులో వేసి కలపాలి. ఇది రైస్ ని పుల్లలు పుల్లులుగా ఉండేలా చేస్తుంది. కొబ్బరి నూనె వాసన కూడా ఉండదు. రైస్ నూనెతో మృదువుగా తయారవ్వడంతో పాటు రుచికరంగా ఉంటుంది.రైస్ ని వడగట్టిన వెంటనే అదే పాత్రలో ఉంచకూడదు. ఇలా చేస్తే వేడి కారణంగా రైస్ త్వరగా పాడవుతుంది. దీని కోసం ఒక పెద్ద పాత్ర లేదా హాట్ బాక్స్ తీసుకుని దాని లోపల శుభ్రమైన తెల్లని క్లాత్ ని వేయాలి. ఆ తర్వాత వడగట్టిన రైస్ ని క్లాత్ లో పెట్టి, బాగా మూతపెట్టాలి. రైస్ వేడి తగ్గేంతవరకు అలాగే ఉంచితే రైస్ తాజాగా ఉంటుంది. అంతేకాకుండా ఇది వేడి కారణంగా ఉబ్బడం లేదా పాడవ్వడం జరగదు. ఈ విధానాన్ని పాటిస్తే.. రైస్ పూర్తిగా ఉడికినప్పటికీ అది తినడానికి బాగా మృదువుగా ఉంటుంది. ఇలా చేయడం వల్ల రోజువారీ ఉపయోగం మాత్రమే కాకుండా పెద్ద కార్యక్రమాల్లో కూడా ఉపయోగపడుతుంది. మీరు ప్రయత్నించి మీ కుటుంబ సభ్యులందరికీ తెలియజేయండి.

## బిజినెస్

# బ్యాంకులకు నిధులు కటకట!

### టాప్-10లో నాలుగు సంస్థల ఎం-క్యాప్ రూ.1.25 లక్షల కోట్లు హాంఫట్.. రిలయన్స్‌కు బిగ్ హిట్..!




దలాల్‌స్ట్రీట్‌లో ఇన్వెస్టర్లలో బలహీన సెంటిమెంట్స్ నేపథ్యంలో గత వారం దేశీయ స్టాక్ మార్కెట్లలో టాప్-10 సంస్థల్లో నాలుగు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,25,397.45 కోట్లు కోల్పోయాయి. వాటిల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీగా నష్టపోయింది. గతవారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 428.87 పాయింట్లు (0.55శాతం), ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 111 పాయింట్లు (0.47 శాతం) నష్టపోయాయి. మార్కెట్‌లో సానుకూల పరిస్థితులు నెలకొన్నా ఈక్విటీ మార్కెట్లు పుంజుకోలేక పోయాయి. ఫలితంగా వరుసగా మూడో వారం ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ నష్టాలతో ముగిసిందని స్వస్తికా ఇన్‌వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా చెప్పారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.74,969.35 కోట్లు నష్టపోయి రూ.16,85,998.34 కోట్లకు చేరుకుంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఎం-క్యాప్ రూ. 21,251.99 కోట్ల పతనంతో రూ.5,19,472.06 కోట్ల వద్ద స్థిర పడింది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) ఎం-క్యాప్ రూ.17,626.13 కోట్లు కోల్పోయి రూ.6,64,304.09 కోట్ల వద్ద నిలిచింది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.11,549.98 కోట్ల నష్టంతో రూ.8,53,945.19 కోట్లకు పరిమితమైంది. మరోవైపు, ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.24,934.38 కోట్ల వృద్ధితో రూ.7,78,612.76 కోట్లకు చేరుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎం-క్యాప్ రూ.9,828.08 కోట్లు పుంజుకుని రూ.12,61,627.89 కోట్ల వద్ద స్థిర పడింది. భారతీ ఎయిర్‌టెల్ ఎం-క్యాప్ రూ.9,398.89 కోట్ల వృద్ధితో రూ.9,36,413.86 కోట్ల వద్ద నిలిచింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9,262.3 కోట్లు పెరిగి రూ.15,01,976.67 కోట్ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) ఎం-క్యాప్ రూ.3,442.15 కోట్లు వృద్ధి చెంది రూ.5,56,594.67 కోట్లకు చేరుకుంది. ఐటీసీ ఎం-క్యాప్ రూ.1,689.08 కోట్ల లబ్ధితో రూ.5,52,392.01 కోట్ల వద్ద ముగిసింది. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల్లో టాప్ సంస్థగా రిలయన్స్ కొనసాగుతున్నది. తర్వాతీ స్థానాల్లో టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంకు, ఇన్ఫోసిస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), ఐటీసీ, ఎల్ఐసీ నిలిచాయి

**3 లక్షల కోట్లకు చేరిన లోటు**

**న్యూఢిల్లీ :** ఏ పని ముట్టుకోవాలన్న డబ్బే ప్రధానం. కానీ ఈ డబ్బును రుణాలుగా ఇచ్చే బ్యాంకుల వద్ద నగదు కొరత తారా స్థాయికి చేరుకున్నది. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు నిధుల లేమితో సతమతమవుతున్నాయి. నిధులు లభించకపోవడంతో భారీ ప్రాజెక్టులకు రుణాలు ఇవ్వడానికి జంకుతున్నాయి. దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థ లిక్విడిటీ లోటు పదేండ్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ లోటు రూ.3.3 లక్షల కోట్లు(38.2 బిలియన్ డాలర్లు)గా ఉన్నట్లు బ్లూంబర్గ్ ఎకానమి ఇండెక్స్‌లో వెల్లడించింది. 2010 తర్వాత నగదు కొరత ఇంతటి స్థాయిలో ఉండటం ఇదే ప్రథమం.

**బ్యాంకింగ్ మార్జిన్లపై ప్రభావం**

నిధులు లేక సతమతమవుతున్న బ్యాంకు లు తమ మార్జిన్లపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తు న్నారు విశ్లేషకులు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ గణనీయంగా పడిపోతుండటం, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు భగ్గుమంటుండటంతోపాటు యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు లిక్విడిటీ తగ్గడానికి ప్రధాన కారణాలని నిపుణులు అంచనావేస్తున్నారు. రూపాయి పతనాన్ని అడ్డుకట్ట వేయడానికి రిజర్వు బ్యాంక్ తనవద్దనున్న డాలర్లను విక్రయిస్తున్నది. అలాగే వేరియబుల్ రేపోరేటు వేలాన్ని నిర్వహిస్తున్నది. బ్యాం కింగ్ వ్యవస్థలోకి నిధుల ప్రవాహాన్ని పెంచేందుకు రోజువారిగా వేలం నిర్వహిస్తున్నది. గడిచిన పదిహేను రోజుల్లోనే రెండుసార్లు నిర్వహించిన వేలం ద్వారా రూ.1.45 లక్షల కోట్ల నిధులను మార్కెట్లోకి చొప్పించింది.



**ఆర్థిక రంగానికి చేటు**

నిధులు లేక బ్యాంకులు సతమతమవుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థకు చేటు చేయనున్నదని విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. ప్రపంచంలో అత్యంత వేగవంతమైన వృద్ధిని నమోదు చేసుకుంటున్న భారత ఆర్థిక వ్యవస్థకు బీటలు పడే ప్రమాదం ఉన్నదని వారు హెచ్చరిస్తున్నారు. అతిపెద్ద బ్యాంకులు తమ రుణాలు ఇవ్వడానికి వెనుకంజ వేసే అవకాశాలుండటంతో అతిపెద్ద ప్రాజెక్టులు నత్తనడకన సాగే ప్రమాదం ఉన్నదంటున్నారు. మరోవైపు డిపాజిట్లు అంతంత మాత్రంగానే ఉండటంతో బ్యాంకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుతం నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థలు నగదు కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో ఎన్‌బీఎఫ్‌సీలు అత్యధిక వడ్డీకి రుణాలు తీసుకొవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నిధుల కొరత రాకుండా పలు చర్యలు తీసుకోవాలి.

## 90 వేల మంది ఉద్యోగులు.. రూ.1,070 కోట్లు.. భారీగా పన్ను ఎగవేత బట్టబయలు!

పెద్ద సంఖ్యలో తప్పుడు రీఫండ్ క్లెయిమ్‌లను ఆదాయపు పన్ను శాఖ గుర్తించింది. దాదాపు 90,000 మంది జీతభత్యాల పన్ను చెల్లింపుదారుల ద్వారా రూ.1,070 కోట్ల విలువైన పన్ను మినహాయింపు క్లెయిమ్‌లు తప్పుగా వెల్లడయ్యాయి. సెక్షన్‌లు 80GGB/80GGC కింద ITRలో తప్పుడు తగ్గింపులను చూపడం ద్వారా ఈ క్లెయిమ్‌లు చేర్చారు. ఈ ఉద్యోగులు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో పెద్ద కంపెనీలు, బహుళజాతి కంపెనీలలో పనిచేస్తున్నారని గుర్తించారు. దీంతో అధికారులు యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. తదనంతరం పన్ను చెల్లింపుదారులు తప్పు క్లెయిమ్‌లను ఉపసంహరించుకున్నారు. అలాగే అదనపు పన్నును చెల్లించారు. ఆదాయపు పన్ను శాఖ భారీ పన్ను ఎగవేతను బట్టబయలు చేసింది. దాదాపు 90,000 మంది వేతన ఉద్యోగులు తమ ఆదాయపు పన్ను రిటర్న్‌లలో (%×ు=%) పన్ను మినహాయింపును తప్పుగా క్లెయిమ్ చేశారని అధికారులు గుర్తించడంతో ఈ విషయం బట్టబలైంది. ఈ ఉద్యోగులు ఆదాయపు పన్ను చట్టంలోని వివిధ సెక్షన్ల కింద తప్పుడు మినహాయింపులు చూపినట్లు ఆ శాఖ విచారణలో తేలింది. 80GGB/80GGC సెక్షన్ల కింద పెట్టుబడి, బీమా, విరాళం, వైద్య ఖర్చులు మొదలైన వాటిపై పన్ను మినహాయింపు లభిస్తుంది. పలు కేసుల్లో ఒకే కంపెనీకి చెందిన పలువురు ఉద్యోగులు తప్పుడు ప్రకటనలు చేసినట్లు కూడా ఆ శాఖ విచారణలో వెల్లడైంది. దీంతో కొంత పన్ను ఎగవేత జరుగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. సెక్షన్ 80GGB/80GGC కింద చూపిన తగ్గింపులకు, వాస్తవ రశీదులకు మధ్య భారీ వ్యత్యాసం కనిపించిందని డిపార్ట్‌మెంట్ తెలిపింది. అదేవిధంగా, సెక్షన్ల 80GGB/80GGC కింద చేసిన క్లెయిమ్‌లు కూడా అనుమానాస్పదంగా కనిపించాయి.




## స్పోర్ట్స్

## మహిళల అండర్-19 వరల్డ్‌కప్‌లో భారత్ జోరు..

# బంగ్లాపై ఘన విజయం

మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్ జోరు కొనసాగుతోంది. భారత యువ మహిళలు వరుస విజయాల పరంపర కొనసాగిస్తున్నారు. ఇప్పటికే వరుసగా మూడు మ్యాచ్‌లలో గెలిచిన భారత్.. ఆదివారం సూపర్ సిక్స్ గ్రూప్-1లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘన విజయాన్ని నమోదు చేసింది. ప్రత్యర్థి బంగ్లాను 8 వికెట్ల తేడాతో మట్టి కరిపించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ జట్టును భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 64 పరుగుల వద్ద కట్టడి చేసింది. బంగ్లా బ్యాటర్‌లలో సుమైయా అక్తర్ మినహా ఎవరూ పెద్దగా రాణించలేకపోయారు. ఆ తర్వాత స్వల్ప లక్ష్య ఛేదన కోసం బ్యాటింగ్‌కు దిగిన ఇండియా కేవలం 7.1 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. తెలుగమ్మాయి గొంగడి త్రిష 31 బంతులను ఎదుర్కొని 8 ఫోర్లతో 40 పరుగులు రాబట్టి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించింది. జట్టు విజయానికి చేరువైన దశలో త్రిష ఔటయ్యింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నిక్కీ ప్రసాద్ (5 నాటౌట్) విన్నింగ్ షాట్ కొట్టింది. భారత్ తదుపరి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో తలపడనుంది. బంగ్లా బ్యాటర్‌లలో సుమైయా అక్తర్ (21 నాటౌట్) మాత్రమే టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లలో వైష్ణవీ శర్మ 3 వికెట్లు, షబ్నమ్, జోషిత, త్రిష తలా ఒక వికెట్ పడగొట్టారు.



### తొలి వన్డేతోనే కెరీర్ ముగించిన నలుగురు టీమిండియా బ్యాడ్ లక్ ప్లేయర్లు



కేవలం ఒక మ్యాచ్ ఆడిన తర్వాత వన్డే కెరీర్ ముగించిన నలుగురు భారతీయ క్రికెటర్లు ఉన్నారు. బహుశా ఈ క్రికెటర్ల రాతలో భారత్ తరపున బ్లూ జెర్సీలో ఎక్కువ క్రికెట్ ఆడాలని రాసి ఉండకపోవచ్చు. ప్రతి క్రికెటర్ తన దేశం కోసం క్రికెట్ ఆడి ఎంతో పేరు సంపాదించాలని కలలు కంటారు. కానీ, భారతదేశం తరపున వన్ డే ఇంటర్నేషనల్ ఆడే అవకాశం పొందిన నలుగురు దిగ్గజ భారతీయ క్రికెటర్లు కూడా ఉన్నారు. అదే మ్యాచ్ వారి చివరి మ్యాచ్ అని నిరూపితమైంది. అలాంటి నలుగురు క్రికెటర్లను ఓసారి చూద్దాం:

**1. పర్వేజ్ రసూల్..**

35 ఏళ్ల పర్వేజ్ రసూల్ జమ్మూ కాశ్మీర్‌లో జన్మించిన ఆల్‌రౌండర్. పర్వేజ్ రసూల్ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్, ఆఫ్-బ్రేక్ బౌలర్. 2014 ఐపీఎల్ వేలంలో పర్వేజ్ రసూల్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 95 లక్షలకు కొనుగోలు చేసింది. ఐపీఎల్‌లో ఆడే అవకాశం పొందిన జమ్మూ కాశ్మీర్‌కు చెందిన తొలి క్రికెటర్ పర్వేజ్ రసూల్. పర్వేజ్ రసూల్ 15 జూన్ 2014న మిర్పూర్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన భారత క్రికెట్ జట్టు కోసం తన వన్డే అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అయితే, అతని మొదటి వన్డే మ్యాచ్ అతని చివరి మ్యాచ్ అని నిరూపితమైంది. ఈ మ్యాచ్‌లో పర్వేజ్ రసూల్‌కు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కానీ, బౌలింగ్‌లో 2 వికెట్లు పడగొట్టాడు.

**2. పంకజ్ సింగ్..**

పంకజ్ సింగ్ 5 జూన్ 2010న శ్రీలంకతో తన కెరీర్‌లో మొదటి వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడాడు. అయితే, అతని మొదటి మ్యాచ్ అతని చివరి మ్యాచ్ అని నిరూపితమైంది. ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌లో 6 మే 1985లో జన్మించిన పంకజ్ సింగ్ ఒక ఫాస్ట్ బౌలర్. శ్రీలంకపై పంకజ్ సింగ్ 42 బంతుల్లో 45 పరుగులు ఇచ్చాడు. కానీ, ఒక్క వికెట్ కూడా తీయలేదు.

**3. ఫైజ్ ఫజల్..**

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో 7 సెప్టెంబర్ 1985న జన్మించిన ఫైజ్ ఫజల్ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్. గతంలో సెంట్రల్ జోన్, ఇండియా రెడ్, ఇండియా అండర్-19, రైల్వేస్, రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడిన విదర్భ క్రికెట్ జట్టు తరపున ఆడాడు. 2015%-%16 దేవధర్ ట్రోఫీలో, ఫైజ్ ఫజల్ ఇండియా బితో జరిగిన ఫైనల్‌లో ఇండియా ఎ తరపున 112 బంతుల్లో 100 పరుగులు చేశాడు. 2015-16 ఇరానీ కప్‌లో ముంబైకి వ్యతిరేకంగా 480 పరుగుల విజయవంతమైన పరుగులో రెస్ట్ ఆఫ్ ఇండియా తరపున ఫైజ్ ఫజల్ 127 పరుగులు చేశాడు. అతను 2018-19 దులీప్ ట్రోఫీకి ఇండియా బ్లూ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఫైజ్ ఫజల్ 2016 సంవత్సరంలో జింబాబ్వేతో తన మొదటి వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడాడు. ఇందులో అతను 61 బంతుల్లో 90.16 స్ట్రైక్ రేట్‌తో 55 పరుగులు చేశాడు.

## రంజీల్లో ఎంట్రీ ఇవ్వనున్న విరాట్ కోహ్లా.. అభిమానులకు బంపర్ ఆఫర్ ఇచ్చిన డీడీసీఏ!

టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ త్వరలో చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ రంజీల్లో ఆడనున్నాడు. వరుస పరాజయాల తర్వాత బీసీసీఐ ప్రతి క్రికెటర్ దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందేనని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే కెప్టెన్ రోహిత్‌తో పాటు మరికొందరు ప్లేయర్స్ రంజీల్లో పాల్గొంటున్నారు. త్వరలోనే ఢిల్లీ జట్టు రైల్వేస్‌తో చివరి మ్యాచ్ ఆడనున్నది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ బరిలోకి దిగనున్నాడు. దాదాపు 13 సంవత్సరాల తర్వాత విరాట్ దేశవాళీ క్రికెట్ ఆడనున్నారు. చివరిసారిగా నవంబర్ 2012లో ఘజియాబాద్‌లో ఉత్తరప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్ ఆడాడు. విరాట్ డొమెస్టిక్ క్రికెట్ ఆడనున్న నేపథ్యంలో ఢిల్లీ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నది. స్టేడియం వద్ద భారీగా భద్రతను పెంచడంతో పాటు స్టేడియంలో దాదాపు 10వేల మంది ప్రేక్షకులకు ఆతిథ్యం ఇవ్వబోతున్నది. ఈ మేరకు డీడీసీఏ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నది. నార్త్ ఎండ్, ఓల్డ్ క్లబ్ హౌస్‌ను అభిమానుల కోసం తెరవనున్నది. అదనపు సీటింగ్ ఏర్పాట్లు అవసరమైతే, మిగిలిన స్టాండ్స్‌ను గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేస్తామని సంబంధిత వర్గాలు తెలిపాయి. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా రైల్వేస్ జట్టును ఢిల్లీ ఢీకొట్టనున్నది. తొలి మ్యాచ్‌లో ఘోర ఓటమి పాలైన ఢిల్లీ.. ప్రస్తుతం విరాట్ కోహ్లీపైనే




ఆశలు పెట్టుకున్నది. తొలి మ్యాచ్‌లో కెప్టెన్ ఆయుష్ బడోని ఒక్కడే పర్వాలేదనిపించాడు. రిషబ్ పంత్ విఫలమయ్యాడు. తాజాగా విరాట్ కోసం జట్టుతో పాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ మ్యాచ్‌ను అభిమానులు ఉచితంగా వీక్షించేలా చర్యలు తీసుకుంటున్నది. మ్యాచ్ టికెట్లను విక్రయించడం లేదని డీడీసీఏ ప్రకటించింది. జనవరి 30న మ్యాచ్ జరుగనున్నది. ఆస్ట్రేలియా పర్యటనలో చివరిదైన సిడ్నీ టెస్టులో మెడనొప్పితో విరాట్ మైదానం వీడిన విసయం తెలిసిందే. తాజాగా రైల్వేస్‌తో జరిగే మ్యాచ్‌కు అందుబాటులో ఉంటానని డీడీసీఏకు ఇప్పటికే సమాచారం ఇచ్చాడు. చాలా ఏళ్ల తర్వాత విరాట్ రంజీల్లో ఢిల్లీ తరఫున బరిలోకి దిగుతుండడంతో.. మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. బ్యాట్‌తో పరుగుల వరద పారించి.. మళ్లీ ఫామ్‌లోకి తిరిగి వస్తాడని ఆశిస్తున్నారు.




# హైప్ పెంచేస్తున్న సుధీర్ బాబు సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ జటాధర లుక్

టాలీవుడ్ యాక్టర్ నవ దళపతి సుధీర్ బాబు నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ జటాధర  తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. రిపబ్లిక్ డే సందర్భంగా వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను షేర్ చేశారు. పాపులర్ జీ స్టూడియోస్ ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం కానుంది. యాక్షన్‌తో నిండిన, ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో సాగే జటాధార మీ మనసును కదిలించబోతుంది. షూటింగ్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతుంది. అంటూ రిపబ్లిక్ డే సందర్భంగా అప్‌డేట్ అందించారు మేకర్స్. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే నిర్మాణ విలువలతో సినిమా ఉండబోతున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలు కానుంది. ఈ చిత్రాన్ని శివన్ నారంగ్, ప్రేర్నా అరోరా, నిఖిల్ నందా, ఉజ్వల్ ఆనంద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గతేడాది హరోం హర, మా నాన్న సూపర్ హీరో సినిమాలో ప్రేక్షకుల ముందుకొచ్చాడు సుధీర్ బాబు. ఈ సారి రూటు మార్చి సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌తో రాబోతుండటంతో ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెరిగిపోతుంది.




# 'దళపతి 69' నుంచి విజయ్ సెకండ్ లుక్ రిలీజ్

తమిళ సూపర్ స్టార్ దళపతి విజయ్ మరికొన్ని రోజుల్లో సినిమాలు దూరమవుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్ తమిళ వెట్రి కళగం అనే పార్టీని స్థాపించాడు. ఇక నుంచి తాను పూర్తిగా రాజకీయల్లోనే ఉంటానని.. ఇదే తన చివరి చిత్రం అంటూ దళపతి69 ప్రాజెక్ట్‌ను ప్రారంభించాడు. జన నాయగన్ (ప్రజల నాయకుడు) అనే టైటిల్‌తో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను కార్తీ (ఖాకీ) సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న హెచ్.వినోద్ దర్శకత్వం వహించబోతున్నాడు. రిపబ్లిక్ డే కానుకగా ఈరోజు ఉదయం చిత్రం నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టైటిల్‌ను రివీల్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా మూవీ నుంచి విజయ్ సెకండ్ లుక్ పోస్టర్‌ను వదిలారు. కొరడా పట్టుకుని ఉన్న విజయ్ లుక్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించనుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్ ఈ మూవీని నిర్మించనుంది. ప్రేమలు ఫేమ్ మమితా బైజు ఈ సినిమాలో కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాను అక్టోబర్ 2025న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.




# హిట్-3 లుక్‌తో నాని

గతేడాది సరిపోదా శనివారం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు నాని  ఈ స్టార్ యాక్టర్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి హిట్ ఫ్రాంఛైజీ హిట్ 3  ఇప్పటికే శైలేష్ కొలను దర్శకత్వంలో వచ్చిన హిట్, హిట్-2 చిత్రాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. ఇక హిట్ 3 కోసం అర్జున్ సర్కార్ డ్యూటీలో చేరిపోయాడు.. అంటూ మేకర్స్ నాని పాత్రపై స్నీక్ పీక్ అందిస్తూ గ్లింప్స్ విడుదల చేశారని తెలిసిందే. మంచు పర్వతాల మధ్య కారుతో దూసుకుపోతున్న హిట్ ఆఫీసర్‌ని ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు ఛేజ్ చేస్తున్న సన్నివేశాలు హైప్ పెంచేస్తున్నాయి. భారతదేశం, భారతీయుల అమర స్ఫూర్తికి వందనం. హిట్ టీం తరపున గణతంత్ర దినోత్సవ శు భాకాంక్షలు. %ఎ×% 3 2025 మే 1న ప్రపంచవ్యాప్తంగా సినిమా థియేటర్లలోకి వస్తోందని తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. నాని గన్ పట్టుకొని సెల్యూట్ చేస్తున్న పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని వాల్‌పోస్టర్ సినిమా, నాని హోం బ్యానర్ యునానిమస్ ప్రొడక్షన్స్ పై ప్రశాంతి త్రిపురనేని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని సిగార్ తాగుతూ, రక్తపు చేతులతో కారు నడుపుతూ, మరోవైపు గొడ్డలితో స్టైలిష్‌గా కనిపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు నాని. ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# మనదే ఇదంతా.. రవితేజ 'మాస్ జాతర' గ్లింప్స్ రిలీజ్

మాస్ మహరాజా రవితేజ హీరోగా భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' ట్యాగ్‌లైన్. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీలీల కథానాయికగా కనిపించనున్న ఈ చిత్రం మే 9న థియేటర్‌లలో సందడి చేయనుంది. నేడు రవితేజ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు చిత్రబృందం శుభాకాంక్షలు తెలుపుతూ.. 'మాస్ జాతర' అంటూ గ్లింప్స్ రిలీజ్ చేశారు. టైటిల్‌కు తగినట్లుగానే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంది ఈ గ్లింప్స్. చాలా రోజుల తర్వాత పాత రవితేజ కనిపించబోతున్నాడని.. రవితేజ అభిమానులు కోరుకునే అన్ని అంశాలుంటాయని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందిస్తున్నారు.




Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com